తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

అనునిత్యం ప్రజల పక్షం

RNI: TELTEL/2023/88710

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్



విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలవడుతున్న

తెలంగాణ ముచ్చట్లు దిన పత్రికలో

పనిచేయుటకు జిల్లా బ్యూరో, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఆర్.సి.లు, మండల స్థాయి రిపోర్టర్లుగా పనిచేయుటకు ఆసక్తి, ఉత్సాహం కలిగిన యువతి యువకులు కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

9493669669, 9391230209



వరంగల్ సంపుటి : 2 సంచిక : 9 మంగళవారం 10 - 09 - 2024 పేజీలు : 08 వెల : 5 www.telanganamuchatlu.in


## తెలంగాణ విద్యార్థులకు హ్యాండ్లూమ్ కోర్సులు

- విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లోకి వెళ్లకుండా వెసలుబాటు
- ఇన్‌స్టిట్యూట్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు
- నాంపల్లిలో ఐఐహెచ్‌టీని వర్చువల్‌గా ప్రారంభించిన సిఎం






హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : తెలంగాణ విద్యార్థులకు హ్యాండ్లూమ్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. సోమవారం నాంపల్లిలో ఐఐహెచ్‌టీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఐఐహెచ్‌టీని ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. తెలంగాణ విద్యార్థులు ఏపీ, ఒడిశా రాష్ట్రాలకు

మిగతా 2వ పేజీలో

## వైద్యురాలి తండ్రి ఆరోపణలు ఖండించిన సీఎం మమత

## ఇదంతా కుట్ర



కోల్‌కతా, తెలంగాణ ముచ్చట్లు : ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ట్రైయినీ వైద్యురాలి హత్యాచార ఘటనలో మృతురాలి తల్లి దండ్రులకు పోలీసులు లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారంటూ వస్తున్న ఆరోపణలపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సోమవారం కోల్‌కతాలో స్పందించారు. ఈ ఆరోపణలను ఆమె ఖండించారు. ఇటువంటి పని తమ ప్రభుత్వం ఎప్పుడు చేయదన్నారు. తమ ప్రభుత్వంపై వెల్లువెత్తిన ఈ ఆరోపణల వెనుక కేంద్ర ప్రభుత్వ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. అందులో వామపక్ష పార్టీల ప్రమేయం సైతం ఉందని ఈ సందర్భంగా సీఎం మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కుమార్తె హత్యాచార ఘటన కేసులో తాము మౌనంగా ఉండేందుకు కోల్‌కతా పోలీసులు తమకు లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారంటూ గత వారం మృతురాలి తండ్రి ఆరోపించారు. దీనిపై సీఎం మమతా బెనర్జీపై విధంగా స్పందించారు. చనిపోయిన వైద్యురాలి కుటుంబానికి తాను నగదు మిగతా 2లో...

## హైకోర్టు తీర్పుపై బిఆర్ఎస్ హర్షం

- తెలంగాణలో ఉప ఎన్నికలు ఖాయం
- పార్టీ మారిన వారు మాజీలు కాక తప్పదు
- ప్రభుత్వానికి చెంపపెట్టు అన్న కెటిఆర్



హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే ఈ విషయంపై బీఆర్ఎస్ పార్టీ హై కోర్టులో ఎమ్మెల్యేలకు సంబంధించి అనర్హత పిటిషన్ వేసింది. తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా కీలక తీర్పు వెలువరించింది. అయితే తెలంగాణ

మిగతా 2లో...



## హైకోర్టు తీర్పు... పార్టీ మారిన వారికి చెంపపెట్టు

- సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి వ్యాఖ్య

సూర్యాపేట, తెలంగాణ ముచ్చట్లు : బీఆర్ఎస్ బి ఫామ్ పై గెలిచి, పార్టీ మారిన ద్రోహులకు చెంప పెట్టులా హైకోర్టు తీర్పు వచ్చింది. ప్రజాస్వామ్యంపై నమ్మకం పెరిగేలా కోర్టు తీర్పు ఉంది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు

మిగతా 2లో...

## పార్టీలు మారడం ప్రజాస్వామ్య విరుద్ధం

- హైకోర్టు తీర్పును స్వాగతించిన బిజెపి ఎంపి లక్ష్మణ్



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : తెలంగాణలో కాంగ్రెస్ అసమర్థ పాలన సాగిస్తోందని రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. సీఎం, మంత్రులు ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారు తప్పితే.. ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం, మంత్రులు ఢిల్లీకి గులాములుగా మారారని ఎద్దేవా చేశారు. ప్రజావైద్యం పూర్తిగా పడకేసింది, పేదలు చదువుకునే గురుకులాలను నిర్వీర్యం చేశారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు హైడ్రాను తెరపైకి తెచ్చారు. చట్టం చేయకుండా జీవో ద్వారానే హైడ్రాను నడుపుతున్నారు. ఉచిత బస్సు ప్రయాణం పెట్టి బస్సుల సంఖ్యను తగ్గించారు. రైతుబంధు రాక, రుణమాఫీకాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ 9 నెలల పాలనలో 400 మందికిపైగా రైతులు చనిపోయారు. రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ చేసిన మోసానికి సురేందర్‌రెడ్డి ఆత్మహత్యే తార్కాణం. ఫసల్ బీమా అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పింది.. కానీ ఇప్పటి వరకు దాని ఊసే ఎత్తట్లేదు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఆందోళన బాట పడితే ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యేల పార్టీమార్పుపై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలో చేరి మంత్రి అవుతున్నారు. భారాస

మిగతా 2లో...

## తెలంగాణ హైకోర్టు అద్భుతమైన తీర్పు

- ఇన్సెంటివ్స్ ఇచ్చి పార్టీలో చేర్చుకున్న కాంగ్రెస్

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు అద్భుతమైన తీర్పు ఇవ్వటాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఇన్సెంటివ్స్ ఇచ్చి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారని ఆరోపణలు చేశారు. సోమవారం నాడు తెలంగాణ భవన్‌లో పాడి కౌశిక్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ డబుల్ స్టాండ్ ఏంటి అని ప్రశ్నించారు.

మిగతా 2లో...


## హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

- స్పీకర్ నిర్ణయం తీసుకోక తప్పదు
- మాజీ ఎంపి వినోద్ కుమార్ వ్యాఖ్య



వరంగల్, తెలంగాణ ముచ్చట్లు : పార్టీ మారిన ఎమ్మెల్యేలకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ ఎంపీ వినోద్ కుమార్ స్పందించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్‌పై విచారణ జరిగిందని.. సుదీర్ఘ వాదనలు జరిగాయన్నారు. నాలుగు వారాల్లో విచారించి నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ నిర్లక్ష్యం చేస్తే తామే విచారణ చేస్తామని హైకోర్టు చెప్పిందన్నారు. స్పీకర్ చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. 1985లో రాజీవ్ గాంధీ 52వ షెడ్యూల్ సవరణ ద్వారా పార్టీ మారే, పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించే వారిపై అనర్హత వేటు వేయాలని చట్టం తెచ్చారన్నారు. ఒక సమయం దానిలో పెట్టకపోవడమే ఇన్ని అనర్థాలకు 2లో

## ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పోటీ మాత్రమే చేశాం



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : ప్రభుత్వంలో సీపీఐ భాగస్వామ్యం కాదంటూ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలసి పోటీ మాత్రమే చేశామని స్పష్టం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల పదవిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించటానికి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడ్తోందన్నారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం అయితే సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించే వాళ్ళమని తెలిపారు. కేంద్రం తెలంగాణ రాష్ట్రంపై వివక్ష చూపొద్దని విజ్ఞప్తి చేశారు. మానవత్వంతో కేంద్రం రాష్ట్రానికి సహాయం చేయాలన్నారు. జాతీయ విపత్తు కింద తెలంగాణకు కేంద్రం 6వేల కోట్లు ఇవ్వాలని... కానీ తమ అంచనా ప్రకారం 10,000కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లు కూలిపోయిన, దెబ్బతిన్న ఇళ్లకి, పంట నష్టానికి రూ.10వేలు సరిపోవన్నారు. నష్టపోయిన దానిలో కనీసం సగం అయిన ఇవ్వాలన్నారు. “మావోయిస్టులు ఏమైనా రాక్షసులా? నక్సల్‌పై అమిత్ షాకు ఎందుకంత కక్ష?” అని ప్రశ్నించారు. మావోయిస్టులతో చర్చలు జరపాలన్నారు. మావోయిస్టుల విషయంలో కేంద్రం మాయలో పడి రాష్ట్ర ప్రభుత్వం తప్పులు చేయకూడదని 2లో

తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL12273
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక



# సంపాదకీయం

## మొదటిసారి బిడ్డను చేతిలోకి తీసుకున్న అనుభూతి!

నేను ప్రచురించిన, నా పేరుతో వచ్చిన మొదటి పుస్తకం, సాహిత్యానికి సంబంధించిన పుస్తకం 'అతడు – ఆమె: మనం' అనే సాహిత్య విమర్శ పుస్తకం. ఆ పుస్తక రచన, ప్రచురణ అన్నీ ఆ రోజుల్లో అనుకోకుండా జరిగి పోయాయి. ఆ పుస్తకం 1983లో ప్రచురించాను. 1981, 82 సంవత్సరాలలో ఆంధ్రజ్యోతిలో ఉప్పల లక్ష్మణరావు ఆత్మకథ 'బతుకు పుస్తకం' ధారావాహికంగా ప్రచురించారు. అందులో ఆయన తన నవల 'అతడు – ఆమె' గురించి నిరాశా జనకంగా రాశారు. ఆ పుస్తకానికి సరైన సమీక్షలు, విమర్శలు రాలేదని, సరైన చర్చ జరగలేదనీ దిగులు పడ్డారు. 82లో 'బతుకు పుస్తకం' పూర్తయ్యాక నేను కొందరు మిత్రులతో కలిసి బరంపురం వెళ్ళి లక్ష్మణరావు గారింట్లో నాలుగు రోజులున్నపుడూ ఆయన 'అతడు – ఆమె'ను తెలుగు పాఠకులు, విమర్శకులు చర్చించలేదని అన్నారు. అది నాకు చాలా ఇష్టమైన నవల. దాని గురించి నేను ఎందుకు రాయకూడదూ అనుకున్నాను. 'అతడు – ఆమె' గురించి విమర్శ గానీ, ప్రశంస గానీ రాయాలంటే జాతీయోద్యమం గురించి, కమ్యూనిస్టు ఉద్యమపు తొలినాళ్ళ గురించి, స్త్రీ పురుష సంబంధాల గురించీ చాలా అధ్యయనం చేయాలి. అప్పుడు నేను లెక్చరర్‌గా పని చేస్తున్న వి.యస్.ఆర్ కళాశాలలో ఎంతో మంచి లైబ్రరీ ఉండేది. ఆరు నెలల పాటు ఆ లైబ్రరీలో కూచుని 'అతడు – ఆమె: మనం' రాయటం పూర్తి చేశాను. అంతలో బరంపురం నుంచి 'బతుకు పుస్తకం' ఆవిష్కరణ సభలో మాట్లాడమని పిలుపు వచ్చింది. ఆ సభలో గంట సేపు 'అతడు – ఆమె' నవల గురించి మాట్లాడాను. లక్ష్మణ రావు గారు పొంగిపోయారు. మరో మూడు నెలలకు 'అతడు – ఆమె: మనం' పుస్తకం ఆయన చేతిలో ఉంచి నమస్కరించాను. తన జీవిత కాలంలో 'అతడు – ఆమె' గురించి అంత మంచి, పెద్ద పుస్తకం చూడగలనని అనుకోలేదని లక్ష్మణరావు గారు చాలా సంతోషించారు. ఆయను సంతోషపెట్టానని నేనూ. ఐతే పుస్తకం రాయటం నా చేతిలో పని – కానీ ప్రచురించటం ఎలా? నాకు అను భవం లేదు. పైగంబర కవిత్వం ప్రచురణ బాధ్యతలు సుగమ్ బాబు, దేవిప్రియ చూశారు. నా రాజకీయ రచన 'సాంస్కృతిక విప్లవం – మావో' పుస్తక ప్రచురణ కూడా నా ప్రమేయం లేకుండా జరిగింది. కానీ 'అతడు – ఆమె: మనం' రాసే నాటికి నేను తెనాలిలో చాలా ఒంటరితనంలో ఉన్నాను. డబ్బు సమస్య కాదు. పదేళ్ళ నుంచీ లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. కానీ ప్రింటింగ్ ఎవరు చేస్తారు? ఎవరు ఆ బాధ్యత తీసుకుం టారు? విజయవాడలో నేను 'కరుణక్కా' అని పిలిచే డాక్టర్ కరుణ గారు శ్రీశ్రీ విశ్వేశ్వరరావు గారి గురించి చెప్పినట్లు గుర్తు. ఆయన అప్పుడే ప్రింటింగ్ ప్రెస్ పెట్టారు. నా పుస్తకమే మొదటి పుస్తకంగా ఆయన చేతిలోకి వెళ్ళింది. నాకు ప్రూఫ్ రీడింగ్, కవర్ పేజీ ముద్రణ ఇవేమీ తెలియవు. అన్నీ విశ్వేశ్వరరావు గారి బాధ్యతేనని చెప్పాను. ఆయన పుస్తకాన్ని ముద్రించి నా చేతిలో పెట్టారు. అప్పటికి నాకు ఇద్దరు పిల్లలున్నా, మొదటిసారి బిడ్డను చేతిలోకి తీసుకున్న అనుభూతి– ఆ పుస్తకం చదివి కరుణక్క ఎంత మంచి ఉత్తరం రాసిందో! డాక్టర్ హేమా పరిమి ఎంత ప్రేమగా ఆలింగనం చేసుకుందో. చదివినవారంతా ప్రశంసల వర్షం కురిపించారు. కృష్ణాబాయి గారు "దీనికే నీకు పిహెచ్‌డి డిగ్రీ ఇవ్వొచ్చు" అన్నారు. అదంతా నవల గొప్పదనమేగాని నా గొప్పదనం కాదని నాకు తెలుసు. ఆ పుస్తకం ఎన్నో ముద్రణలు పొందింది, ఇప్పటికీ మార్కెట్‌లో ఉంది. అందులో కొంత భాగాన్ని 'అతడు – ఆమె'ను పునర్ముద్రించినపుడు ఆ నవల 'వెనక మాట'గా ప్రచురించారు విశాలాంధ్రవారు. అన్ని విధాలా నాకు సంతోషాన్నీ, చిన్నపాటి గర్వాన్నీ కలిగించిన పుస్తకం నా మొదటి పుస్తకమే. ఆ తర్వాతంతా వివాదాలమయమే నా సాహిత్య జీవితం.

అప్పుడు తెలియదుగానీ interdiciplinary పద్ధతిలో సాహిత్య విమర్శ తెలుగులో మొదలుపెట్టింది ఆ పుస్తకమే నని ఇపుడనిపిస్తుంది.

ఒక చిన్న పిడకల వేట– ఆ పుస్తకంలో లోపాలు చూపాలనే పట్టుదలతో ఒక విప్లవ మేధావి అన్నట్టుగా నాకు విజయవాడ మిత్రులు చెప్పారు. నేను ఆ పుస్తకంలో ఒక గొప్ప సన్నివేశాన్ని వివరిస్తూ "అది చదువుతున్నపుడు లక్ష్మణరావుగారి పాదాలకు నమస్కరించాలనిపిస్తుంది" అని ఉద్వేగంగా రాశాను. నన్ను నేను నిలువరించుకోలేక రాసిన మాట అది. విమర్శలో అది కూడదేమో– కానీ విమర్శ ఉద్వేగం గురించి రాలేదు. "పాదాలకు నమస్క రించటం ఫ్యూడల్. ఓల్గా దానిని ప్రోత్సహిస్తుందా," అని అన్నారట. అది విని నేను మిత్రులతో మరి గద్దర్ అమర వీరులకు "పాద పాదాన పరి పరి దండాలు" అని పాడటం, మనందరం ఉద్వేగంగా వినటం ఇదంతా ఫ్యూడలే కదా అన్నాను. అందరం నవ్వుకున్నాం. నిజమే

## హైకోర్టు తీర్పుపై బిఆర్ఎస్ హర్షం

హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ ఫిరాయింపులపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై భారాస సానుకూలంగా స్పందించింది. ఈ తీర్పుతో ఇక ఉప ఎన్నికలు ఖాయమని పేర్కొంది. ఈ సందర్భంగా పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కాంగ్రెస్‌కు హైకోర్టు తీర్పు చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు. నాలుగు వారాల తర్వాత దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుల ఎమ్మెల్యే పదవులు ఊడటం ఖామన్నారు. పార్టీ మారిన అన్ని నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవని, మొదటి నుంచి ఇదే విషయాన్ని చెబుతున్నామని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ అంటూనే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు. న్యాయస్థానాల్లో, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి శిక్ష తప్పదని కేటీఆర్ అన్నారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక విధానాలకు చెంపపెట్టు అని పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్టు తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురికావడం తథ్యమన్నారు. తెలంగాణ హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టే విధంగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురై ఆయా నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయమన్నారు. అనర్హత కారణంగా ఉప ఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ తప్పకుండా గెలుస్తుందన్నారు. హైకోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర శాసన సభాపతి నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడతారని ఆశిస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు.

## తెలంగాణ హైకోర్టు అద్భుతమైన తీర్పు

హిమాచల్ ప్రదేశ్‌లో ఒకలా... తెలంగాణలో మరోలా కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు చేశారు. తెలంగాణలో ఇన్సెంటివ్స్ ఇచ్చి పార్టీలో చేర్చుకున్నారని ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి క్యారెక్టర్ లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ సబ్ రీజనల్ పార్టీగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి అవినీతి సొమ్ముతో పది మంది ఎమ్మెల్యేలను రూ.1000 కోట్లు పెట్టి కొన్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఒక్క నెలలో హైదరాబాద్ రోడ్ల మీద ఖైరతాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఉరికిస్తామని పాడి కౌశిక్‌రెడ్డి మాస్ వార్నింగ్ ఇచ్చారు. హైకోర్టు తీర్పు బీఆర్ఎస్ పార్టీకి విజయమని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ అన్నారు. తెంగాణ అసెంబ్లీ స్పీకర్ స్వతంత్రంగా వ్యవహరించి.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరారు. స్పీకర్ మీద తమకు పూర్తి విశ్వాసం ఉందని వివేకానంద గౌడ్ తెలిపారు. కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక విధానం తెలంగాణలో మరో విధానమా అని ప్రశ్నించారు. అనర్హత వేటు విషయంలో కాలయాపన చేస్తే అపహస్యం కాక తప్పదని విమర్శలు చేశారు. మూడు స్థానాలకు ఉప ఎన్నికలు రాబోతున్నాయని స్పష్టం చేశారు. ముగ్గురు ఎమ్మెల్యేలతో మిగతా వారిపై కూడా నిర్ణయం తీసుకుని వేటు వేయాలని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ తెలిపారు.

## వైద్యురాలి తండ్రి ఆరోపణలు ఖండించిన సీఎం మమత.. ఇదంతా కుట్ర

ప్రయత్నించలేదన్నారు. అయినా నగదు ఇవ్వడం ద్వారా ఆ కుటుంబానికి జరిగిన నష్టాన్ని మాత్రం పూడ్చలేమన్నారు. హత్యాచార ఘటనతో విగత జీవిగా మారిన 32 ఏళ్ల ట్రైయినీ వైద్యురాలు చిరస్థాయిగా నిలిచి ఉండేలా.. ఆమె స్మారకార్థం ఏదైనా చేయాల్సి ఉందని సీఎం మమతా స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం మృతురాలి కుటుంబ వైపునే ఉందని ఈ సందర్భంగా సీఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు. మరోవైపు ఈ వైద్యురాలి హత్యాచార ఘటన అనంతరం రాష్ట్రంలో నిరసనలు వెల్లువెత్తాయని గుర్తు చేశారు ఆ సమయంలో కోల్‌కతా నగర పోలీస్ కమిషనర్ పదవికి రాజీనామా చేసేందుకు ఐపీఎస్ అధికారి వినీత్ గోయెల్ సిద్ధపడ్డారన్నారు. కానీ మరికొద్ది రోజుల్లో కోల్‌కతా మహానగరంలో దసరా ఉత్సవాలు జరగనున్నాయని.. ఈ నేపథ్యంలో శాంతి భద్రతలపై అవగాహన ఉన్న వ్యక్తి ఆ పదవి నుంచి వైదొలిగితే ఎలా అని ఆయన్ని ప్రశ్నించానని సీఎం మమతా బెనర్జీ ఈ సందర్భంగా వివరణ ఇచ్చారు. ఈ హత్యాచార ఘటన వెలుగులోకి వచ్చిన నాటి నుంచి పోలీసులు వ్యవహరించిన తీరుపై మృతురాలి తల్లిదండ్రులు తమ ఆక్రోశం వివిధ సందర్భాల్లో వెళ్లగక్కిన సంగతి తెలిసిందే. తమ కుమార్తె మృతదేహాన్ని చూసేందుకు ఆసుపత్రిలో మూడు గంటల పాటు వేచి చూడాల్సి రావడం.. మృతదేహాన్ని తమకు అప్పగించే సమయంలో ఓ సీనియర్ పోలీసు అధికారి నగదు తమకు ఇచ్చారని.. అయితే తాము దానిని తిరస్కరించామని మృతురాలి తండ్రి గత వారం ఆరోపించిన విషయం విధితమే.

## హైకోర్టు తీర్పు... పార్టీ మారిన వారికి చెంపపెట్టు

ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. నల్లగొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజాకోర్టులో కూడా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగాఉన్నారు. వారిపై అనర్హత వేటు పడటం ఖాయమన్నారు. తెలంగాణలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గులాబీ జెండా ఎగరడం ఖాయమని స్పష్టం చేశారు. ఇక హైడ్రా పేరుతో రేవంత్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నడు. హైదరాబాద్ అంటేనే భయపడేలా చేసిండు. చట్టప్రకారం కాకుండా అడ్డగోలుగా బొల్డోజర్లతో రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. రాజకీయ కక్ష సాధింపు చేస్తూ హైడ్రామా అడుతున్నాడు. రేవంత్ చర్యలు రాజ్యాంగ వ్యతిరేకంగా ఉన్నయని మండిపడ్డారు. అసలు చెరువులు ఎన్ని? వాటి హద్దులు ఎన్ని? అని నిర్ణయం జరగాలి. పేదలకు ఎలాంటి ఇబ్బందులు రావొద్దు. బడా బడా బాబుల విషయంలో ఒకలా పేదల విషయంలో ఒకలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

కారణమన్నారు. 39 ఏళ్ల క్రితం చట్టం వచ్చినా అందులో లోసుగులు ఉండడం కొందరికి ఉపయోగంగా మారిందని తెలిపారు. ప్రధాని మోదీ అన్నీ నీతిలే చెప్తారని.. ఎన్నో చట్ట సవరణలు తెచ్చిన మోదీ ఈ చట్ట సవరణ చేయరని మండిపడ్డారు. శాసనసభ స్పీకర్ కోర్టుతో చీవాట్లు తినాలా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ, ఖర్గే మాటలను తెలంగాణ స్పీకర్ వినకుండా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని రాజకీయ పార్టీలు పట్టుబట్టి 10వ షెడ్యూల్ రద్దు చేయాలన్నారు. స్పీకర్‌కు 4, 6 వారాల్లో నిర్ణయం తీసుకునేలా చట్ట సవరణ చేయాలన్నారు. మోడీ ప్రభుత్వం వెంటనే 10వ షెడ్యూల్ రద్దు చేయకుంటే ప్రజలు ప్రజాస్వామ్యం పట్ల ప్రజలకు గౌరవం కోల్పోతారన్నారు. ఆనాడు చట్టం తెచ్చినప్పుడు రాజీవ్ గాంధీ ఇలాంటి స్పీకర్లు ఉంటారని అనుకోలేదన్నారు. చట్టంలో ఏ నేత తప్పు చేయకుండా చేయాలని.. తప్పు చేసే ఆస్కారం ఉండకుండా చూడాలని మాజీ ఎంపీ వినోద్ కుమార్ వ్యాఖ్యలు చేశారు.

## పార్టీలు మారడం ప్రజాస్వామ్య విరుద్ధం

తరహాలోనే కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతోంది. ఎమ్మెల్యేల పార్టీ మార్పుపై స్పీకర్ నిర్ణయం తీసుకోకుంటే కోర్టు నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. భాజపా విలువలతో కూడిన రాజకీయాలను కోరుకుంటోందని లక్ష్మణ్ అన్నారు.

## ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పోటీ మాత్రమే చేశాం

హితవుపలికారు. సెప్టెంబర్ 11నుంచి 17వరకు రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు జరుపుతామన్నారు. సెప్టెంబర్ 21వ తేదిన భారీ బహిరంగ సభ ఉంటుందని కూనంనేని సాంబశివరావు వెల్లడించారు.

## తెలంగాణ విద్యార్థులకు హ్యాండ్లూమ్ కోర్సులు

వెళ్లి హ్యాండ్లూమ్ కోర్సులు చదవాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో మాట్లాడి ఐఐహెచ్‌టీకి అనుమతులు తెచుకున్నామని ఈ సందర్భంగా వెల్లడించారు. విద్యార్థుల సమయం వృథా కాకూడదని, తెలుగు యూనివర్శిటీలో ఐఐహెచ్‌టీలో ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది ఐఐహెచ్‌టీని స్కిల్ యూనివర్సిటీకి తరలిస్తామని చెప్పారు. ఒక్కో విద్యార్థికి నెలకు 2500 స్టై ఫండ్ ఇస్తామని హామీ ఇచ్చారు. గతంలో సినీ తళుకు బెళుకులు కూడా చేనేతకి తెచ్చారు. కానీ నేతన్నల రాత మారలేదు. గతంలో సిరిసిల్లలో కార్మికులకు బకాయిలు పెట్టారు. ఆ మొత్తం మేము అధికారంలోకి వచ్చాక విడుదల చేశాం. బతుకమ్మ చీరలకు కట్టుకునే స్థాయిలో నాణ్యత లేవు. మంచి డిజైన్‌తో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు ఒక్కొక్కరి ఏడాదికి 2 చీరలు ఇస్తాం. బతుకమ్మ చీరలు ఆగిపోయాయని ఆలోంచాల్సిన అవసరం లేదు అని రేవంత్ రెడ్డి అన్నారు. నేతన్నలకు రుణమాఫీ ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రుణమాఫీకి ఇప్పుడే ఆదేశాలు ఇస్తున్నామని అన్నారు. ' మీ సమస్యల పరిష్కారానికి మీ అన్నగా ఎప్పుడు ముందు ఉంటా. కొడంగల్ నియోజక వర్గంలోని నేతన్నలతో నాకు మంచి సంబంధాలు ఉన్నాయి. నేతన్న కొండా లక్ష్మణ్ బాపూజీ వారసులు. త్యాగాలు చేస్తే ఎలా వేలాది కోట్ల ఆస్తులు సంపాదించారు. పదవిని తృణప్రాయంగా త్యాగం చేసింది కొండా లక్ష్మణ్ బాపూజీ' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టాలని అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. కేసీఆర్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ నిలువ నీడ ఇచ్చారని సీఎం రేవంత్ తెలిపారు. నాంపల్లిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని వర్చువల్‌గా ప్రారంభించారు. లలిత కళాతోరణంలో ఇందుకు సంబంధించిన ప్రారంభోత్సవం నిర్వహించారు. చేనేత అభయహస్తం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ కార్యాలయం ఏర్పాటుకు కొండా లక్ష్మణ్ బాపూజీ స్థలం ఇచ్చారన్నారు. తెలంగాణ కోసం పదవులను తృణప్రాయంగా వదులుకున్నారని చెప్పారు. కానీ కొంత మంది రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలు, ఉపఎన్నికలు తెచ్చారన్నారు. ఆ ఎన్నికల్లో సెలక్షన్లు, కలెక్షన్లు చేసి త్యాగమని చెప్పుకొంటున్నారని విమర్శించారు. గజ్వేల్‌లో ఫాంహౌస్‌లు ఏర్పాటు చేసుకున్నారన్నారు. కేసీఆర్, కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలకు తేడా గమనించాలన్నారు. ఉప ఎన్నికల్లో సెలక్షన్లు, కలెక్షన్లతో బాగుపడిందెవరో ప్రజలకు తెలుసన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ ఎప్పుడూ గుర్తిస్తుందని చెప్పారు. ఐఐహెచ్‌టీకీ కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకుందామన్నారు. ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయాలని ప్రధాని, కేంద్రమంత్రులను కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వారు రాజకీయాలకు అతీతంగా ముందుకు వచ్చి తక్షణమే మంజూరు చేశారని చెప్పారు. నాంపల్లి తెలుగు వర్సిటీలో ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేనేతల జీవన విధానంలో మార్పులు రాలేదు. సిరిసిల్ల నేతన్నలకు బకాయిలు చెల్లించలేదు. కాంగ్రెస్ వచ్చాక వెంటనే వాటిని విడుదల చేశాం. 63 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఏటా 2 చీరలు ఇవ్వాలని నిర్ణయించాం. చేనేతల రుణభారం రూ.30 కోట్లు తీర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కుల, చేతి వృత్తులకు సముచిత న్యాయం చేస్తాం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. నైపుణ్యం గల చేనేత కళాకారులు, నూతన ఆవిష్కర్తల కోసం ఐఐహెచ్‌టీ ప్రారంభించారు. చేనేత రంగంలో ఆవిష్కర్తల ప్రోత్సాహానికి ప్రత్యేక కోర్సులు, శిక్షణ కార్యక్రమాలను ఇక్కడ అందించనున్నారు. అధునాతన పరిశోధన అవకాశాలను ఈ సంస్థ కల్పించనుంది. ఏటా 60 మందికి టెక్స్‌టైల్ టెక్నాలజీలో డిఎలొమా కోర్సులు ఇవ్వనున్నారు. రైతన్న, నేతన్నలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. చేనేత సమస్యలకు సాంకేతికతే ముఖ్య కారణం. చేనేత ఉత్పత్తులు ప్రపంచానికి ఎగుమతులు కావాలి. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. మన పిల్లలకు మన నైపుణ్యం అందించేందుకు ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేస్తాం. అతి తక్కువ సమయంలో కేవలం 10 రోజుల్లోనే ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేశాం. ప్రస్తుతానికి ఐఐహెచ్‌టీ తరగతులు తెలుగు వర్సిటీలో అందిస్తున్నాం. త్వరలో ఐఐహెచ్‌టీని స్కిల్ వర్సిటీకి తరలింపు. నేతన్నల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి. చిన్న వయస్సులోనే రేవంత్ సీఎం అయ్యారు. అన్ని వర్గాలకు న్యాయం చేయాలని కృషి చేస్తున్నారని అన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
TELTEL12273
తెలుగు దిన పత్రిక



# మృతురాలి కుటుంబానికి బిపిఎల్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** అడ్డాకుల మండలం బలీదుపల్లి గ్రామానికి చెందిన బోయ మణెమ్మ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఇదే గ్రామానికి చెందిన కొంతమంది యువకులు కొంతకాలంగా కమిటీగా ఏర్పడి బిపిఎల్ ఫౌండేషన్ ఏర్పాటు చేసుకుని గ్రామంలో కొన్ని సేవా కార్యక్రమాలు, అలాగే నిరుపేదలు చనిపోయిన వారి కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగానే బిపిఎల్ ఫౌండేషన్ సభ్యులు సోమవారం మణెమ్మ మృతికి సంతాపం తెలిపి వారి కుటుంబానికి 5000/- రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మణెమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గణేష్, శ్రీధర్ యాదవ్, కురుమూర్తి యాదవ్, నరసింహ, మహేష్, ఆంజనేయులు, మల్లేష్, అశోక్, అంజి, మన్నెం తదితరులు పాల్గొన్నారు.




# వరద బాధితులకు బియ్యం మరియు నిత్యావసర సరుకులు పంపిణీ

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** భారీ వర్షాలు,వరదల నేపథ్యంలో అతలాకుతలమైన ఖమ్మం పట్టణంలోని జలగం నగర్ లోని వరద బాధితులకు బియ్యం, నూనె, పప్పులు, కారం, పుసుపు, చింతపండు, పంచదార ఇతర నిత్యావసర సరుకులతో పాటుగా, చాపలు, బ్లాంకెట్స్ జమాఅతె ఇస్లామి హింద్ ఖిల్లా అధ్యక్షురాలు అస్ఫియ అన్జుమ్ గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ రిజినల్ ఆర్గనెజర్ హఫ్సా మేహ్వీన్ పట్టణ పట్టణ అధ్యక్షురాలు ఖదిజతుల్ కుబ్రా అందజేశారు. ఈ సందర్భంగా అస్ఫియ అన్జుమ్ మాట్లాడుతూ సర్వం కోల్పోయి బురదలో కూరుకుపోయిన ఇండ్లు ఎటు చూసిన బాధితులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు అన్నారు వేలాది మంది కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు అన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో వరద బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వరద బాధితులను పలకరించి మానసిక మనో ధైర్యాన్ని నింపారు . ఖమ్మం కు ఇంతటి విపత్తు రావడం చాలా బాధాకరమని లోతట్టు ప్రాంతాలలో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్యకర్తలు నస్రీన్ హాజీరా సదఫ్, ఫర్జానా, అర్షియ, ఫరీన్ అఫ్రా తదితరులు పాల్గొన్నారు

# ఆధార్ తరహాలో డిజిటల్ ఐడీ లు జారీ హర్షణీయం

**- రైతులకు త్వరలో డిజిటల్ ఐడీలు ఇవ్వనున్న కేంద్రం**
**- చొప్పదండి నియోజకవర్గం భాజపా జాయింట్ కన్వీనర్ : ఉదారి నరసింహా చారి**

**కరీంనగర్, తెలంగాణ ముచ్చట్లు :** రైతులకు ఆధార్ తరహాలో త్వరలో డిజిటల్ ఐడీలు ఇవ్వనున్నట్లు కేంద్రం వెల్లడించడం హర్షణీయమని రాజన్న సిరిసిల్ల జిల్లా,చొప్పదండి నియోజకవర్గం భాజపా జాయింట్ కన్వీనర్ ఉదారి నరసింహా చారి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని 11 కోట్ల మంది రైతులకు ఆధార్ తరహాలో డిజిటల్ ఐడీలు జారీచేయాలని కేంద్రం నిర్ణయించిందని, రైతులను సాధికారులను చేసేందుకు వచ్చే 3 ఆర్థిక సంవత్సరాలలో ఈ కార్డులను జారీచేయాలని లక్ష్యంగా పెట్టుకుందని,అగ్రిస్టాక్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అందజేసే సేవలు, పథకాలను క్రమబద్ధం చేసేందుకు డిజిటల్ ఐడీలను ఇవ్వనున్నట్లు, వెల్లడించారు.

# జర్నలిస్ట్ సమ్మయ్య సేవలు మరువలేనివి

**- జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ**
**- సీనియర్ జర్నలిస్టు సమ్మయ్యకు ఘన నివాళి**
**- సమ్మయ్య కుటుంబ సభ్యులకు టియూడబ్ల్యూజే (టిజెఎఫ్) 12 వేల ఆర్థికసాయం**



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** సీనియర్ జర్నలిస్ట్, వార్త ఖమ్మం కార్పొరేషన్ రిపోర్టర్ అబ్బుగాని సమ్మయ్య (48) సేవలు మరువలేనివని, ఆయన మరణం జర్నలిస్ట లోకానికి తీరనిలోటని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు పేర్కొన్నారు. అనారోగ్య సమస్యతో సమ్మయ్య అకాల మరణం బాధాకరమన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ ఆధ్వర్యంలో ముస్తఫా నగర్ లోని సమ్మయ్య నివాస గృహానికి వెళ్లి ఆయన భౌతికకాయంపై పూలమాలలు వేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమ్మయ్య కుటుంబ సభ్యులకు తక్షణసాయంగా 12 వేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సీనియర్ జర్నలిస్టుగా సమ్మయ్య అందరికీ సుపరిచితులని, అందరితో కలివిడిగా ఉంటూ మంచి పేరు సంపాదించిన ఆయన మృతి చెందడం బాధాకరమని కొనియాడారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అల్లం నారాయణ, మారుతి సాగర్ లు స్పందించి అకాల మరణం పొందిన సమ్మయ్య కుటుంబానికి అండగా ఉండాలని, ప్రభుత్వం పరంగా అందాల్సిన సాయాన్ని సకాలంలో అందించే విధంగా కృషి చేయాలని జిల్లా నాయకత్వాన్ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, కోశాధికారి బిక్కి గోపి, ఉపాధ్యక్షులు ముత్యాల కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి మూల జీవన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు టిఎస్ చక్రవర్తి, పిన్ని సత్యనారాయణ, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్, నాయకులు వెంకటకృష్ణ, సాయి, రవీందర్, లక్ష్మణ్, డెస్క్ జర్నలిస్టులు ప్రసాద్, శివ, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నోట ఉప ఎన్నిక జూట మాట : కొలిపాక సతీష్



**స్టేషన్ ఘనపూర్: తెలంగాణా ముచ్చట్లు :** రాష్ట్రములో ఉప ఎన్నికలు రావని బీ ఆర్ ఎస్ పార్టీ నాయకుల భ్రమేనని బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన ఎమ్మెల్యేలను బి అర్ ఎస్ పార్టీలోకి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకోలేదా..?అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ కొలిపాక సతీష్ ప్రశ్నించారు. బీ అర్ ఎస్ నాయకులు పగటి కలలు కాంతున్నారని వారి ప్రభుత్వం తొమ్మిదిన్నర సంవత్సరాల పరిపాలన కాలములో ప్రజలకు ఒరగబెట్టింది ఏమిలేదని అన్ని జూట మాటలేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేస్తుందని దీన్ని చూసి ఓర్వడం లేదని దయ్యబట్టారు. రాబోయే రోజుల్లో బి.ఆర్. ఎస్ పార్టీ నామరూపాలు లేకుండా పోతుందన్న భయం వారికి పట్టుకుందని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వం లో వచ్చే 10 సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఉప ఎన్నిక వస్తే కాంగ్రెస్ పార్టీలోకి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు రావడానికి ఎదురు చూస్తున్నాడు బి ఆర్ ఎస్ నాయకులకు వారి పార్టీ మునుగుతుందని ఆ పార్టీ బ్రతికి బట్ట కట్టే పరిస్థితులు లేవని తెలిసే ఏమి చేయాలో తేలియక మతి భ్రమించి మాట్లాడుతున్నారని ఇప్పటి కైనా ఇలాంటి చౌక బారు మాటలు మానలని మీరు చేయని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు.

**గుర్రం సుధీర్ స్థానికులు**

గతంలో సిపిఐ సిపిఎం కాంగ్రెస్ పార్టీలో నుండి గెలిచిన ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ పార్టీలోకి చేర్చుకున్న సంగతి అప్పుడే మర్చిపోయి చౌక బారు మాటలు మాట్లాడుతూ మధ్యంతర ఎన్నికలు వస్తాయి అని అనడం హాస్యస్పదమన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ నుండి ముగ్గురు బయటికి వస్తేనే తీర్పులని డ్రామా చేస్తున్నారు. గతంలో 12 మంది ఎమ్మెల్యేలను తీసుకున్నప్పుడు ఈ చట్టాలు కోట్లు గుర్తు రాలేదని అప్పుడు అధికారంలో ఉన్న ఎంతమంది నైనా ప్రతిపక్ష పార్టీల నుండి చేర్చుకోవచ్చు ఫిర్యాయింపులు జరిగించొచ్చు కానీ కాంగ్రెస్ పార్టీలకు బిఆర్ఎస్ నుండి గెలిచిన అభ్యర్థులు వెళితే మాత్రం కోర్టు కేసులు తీర్పులు అంటూ మధ్యంతర ఎన్నికలు వస్తాయంటూ ప్రచారాలు చూపిస్తూ ప్రజలను ఆందోళన గురి చేయడమే తప్ప వేరేమీలేదన్నారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు చేయొద్దని హెచ్చరించారు. ఒకవేళ మధ్యంతర ఎన్నికలే వస్తే మా అభిమాన నాయకుడు కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించుకునే సత్తా మాకు ఉందన్నారు.

# తన రచనలతో, సాహిత్యంతో ఉద్యమాన్ని బలోపేతం చేసిన ప్రజాకవి కాళోజీ

**కరీంనగర్, తెలంగాణ ముచ్చట్లు :** రాజన్న సిరిసిల్ల జిల్లా, సిరిసిల్ల పట్టణంలోని సిరిసిల్ల సెస్ ప్రధాన కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 110 వ జయంతి వేడుకలను పురస్కరించుకొని బోయినిపల్లి మండల సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి,ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్బంగా సుధాకర్ మాట్లాడుతూ, తన రచనలు, సాహిత్యం ద్వారా తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేసిన గొప్ప వ్యక్తి కాళోజీ నారాయణ రావు అని గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, భారత స్వాతంత్ర్య ఉద్యమం, ఆనాటి నిజాం నిరంకుశ పాలన కు వ్యతిరేఖంగా ఎన్నో ఉద్యమాలు చేశారని,కాళోజీ జయంతిని ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం గొప్ప విషయమని అన్నారు.



# రైతులు ఆందోళన చెందవద్దు

**- నీట మునిగిన భూములను పరిశీలించిన ఎమ్మెల్యే**

**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్దమందడి మండలం వెల్టూర్ గోపాల సముద్రం పూర్తిగా నిండడంతో బ్యాక్ వాటర్ తమ పంట పొలాలను ముంచేస్తుందని పెద్దమందడి మండలం మద్దిగట్ల గ్రామ రైతులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సోమవారం మద్దిగట్ల గ్రామ రైతులతో కలిసి నీటి మునిగిన భూములను పరిశీలించారు. నీటి మునకకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.నూతనంగా నిర్మించిన చెరువు కట్ట నిర్మాణంలో అలుగును పెంచారని దాంతో తమ పొలాల్లోకి చెరువు నీరు చేరిందని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువు ఎఫ్ టి ఎల్ ను పరిశీలించి తగు చర్యలు చేపట్టి.. రైతులకు సహకరించాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు.కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ఆదర్శ పాఠశాలలో కాళోజీ జయంతి వేడుక

తెలంగాణ ముచ్చట్లు,జఫర్గడ్:మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ నందు సోమవారం కాలోజీ నారాయణరావు 110 జయంతి సందర్భంగా "తెలంగాణ భాషా దినోత్సవాన్ని" నిర్వహించడం జరిగింది. పాఠశాల కల్చరల్ కోఆర్డినేటర్, తెలుగు విభాగ అధ్యక్షులు డాక్టర్ మహేందర్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల సమక్షంలో "కాలోజీ కవితా పట్టణం" కార్యక్రమాన్ని నిర్వహించారు. కాళోజి "నా గొడవ" కవితలలోని తెలంగాణ భాషా స్పురనను , ఉద్యమ స్ఫూర్తిని , మాండలిక భాషా ప్రయోజనాలను , తెలంగాణ పలుకుబడులను ఎంతో భావ స్పూరకంగా విద్యార్థినీ విద్యార్థులు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. కాళోజీ కవితా పఠనం కార్యక్రమం ఎంతో వినూత్నంగా, స్ఫూర్తిదాయకంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జానీ నాయక్ ,గణేష్ ,వెంకటేశ్వర్లు, నాగలక్ష్మి ,మనోజ్ ,మూర్తి ,పావని, సంధ్య, జ్యోత్స్న, తదితరులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో కవితా పఠనం చేసిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# మృత దేహానికి నివాళు లర్పించిన కాంగ్రెస్ నాయకులు



**తెలంగాణ ముచ్చట్లు, జఫర్గడ్:** మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రాజరాపు ఎల్లపాప చనిపోగా సోమవారం మృత దేహానికి పూల మాల వేసి వేరు వేరుగా నివాళులర్పించిన స్టేషన్ ఘనపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, నియోజకవర్గ యూత్ నాయకులు తాటికాయల రాజేందర్. వారితో పాటు పార్టీ శ్రేణులు, స్థానికులు ఉన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL12273
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
మంగళవారం 10 -09- 2024




# వెంటనే రైతులకు రుణమాఫీ చేయాలి:రాపర్తి సోమయ్య

తెలంగాణ ముచ్చట్లు,జఫర్గడ్: రుణమాఫీ కానీ రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రాపర్తి సోమయ్య తెలిపారు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా జఫర్గడ్ బ్రాంచ్ ముందు సోమవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బ్రాంచ్ మేనేజర్ కి అందజేశారు. అనంతరం సోమయ్య మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని మాట ఇచ్చి, ఇప్పుడు రైతు రుణాలు మాఫీ చేయడం లేదని వెంటనే మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఏక కాలంలోనే రుణమాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగా అమలు చేయడం దారుణం అన్నారు. అంతే కాకుండా ఆఖరి విడత రుణమాఫీ రైతులను నానా రకాల ఇబ్బందులకు గురిచేస్తుందని ,అనేక షరతులు పెడితే ఎలా రుణమాఫీ అవుతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకర్ల దగ్గర కొత్త డేటా తీసుకొని రుణాలను మాఫీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.అదే విధంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు.అంతేకాకుండా రైతులకు రుణమాఫీ డబ్బులు ప్రభుత్వం ఎంత డబ్బులు మంజూరు చేస్తే అన్ని డబ్బులు రైతులకు రుణరూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఏ షరతులు లేకుండా రైతులకు ఏకకాలంలో రుణ మాఫీ చేయాలనీ, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడి చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి నక్క యాకయ్య, వేల్పుల పెద్ద రాములు, చిన్న రాములు, మాదరాజు యాదగిరి, వడ్లకొండ రాజు, కొంతం సోమయ్య, వెంకటమ్మ, నక్క సంపత్, ఎండి శంషాద్దీన్, ఎర్ర రవి రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# దేవరకద్ర ఎమ్మెల్యే తండ్రి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన వనపర్తి ఎమ్మెల్యే

వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు: మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి గారి తండ్రి ఈనెల 5వ తేదీన స్వర్గస్తులయ్యారు. ఆ సమయంలో ఎంఎల్ఏ స్థానికంగా లేకపోవడంతో సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే గారి సొంత గ్రామం చిన్న చింతకుంట మండలం దమగ్నాపురంలోని వారి నివాసంలో ఆయనను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా స్వర్గస్తులైన దేవరకద్ర ఎమ్మెల్యే గారి తండ్రి కృష్ణారెడ్డి గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఖిల్లా గణపురం మండల సింగిల్ విండో డైరెక్టర్, యువ నాయకులు సాయి చరణ్ రెడ్డి,వనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, శ్రీరంగాపురం మండలం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

# గణేశ్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



మక్తల్, తెలంగాణ ముచ్చట్లు: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, వినాయక మండపాలు వద్ద అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఎన్ లింగయ్య సూచించారు. సోమవారం మక్తల్ పట్టణ కేంద్రం లోని ఆజాద్ నగర్, గాంధీ చౌక్, షరీఫా మసీద్, నూర్ మజీద్, జామియా మసీదు దగ్గరలోని గణేష్ మండపంతోపాటు మరి కొన్ని ప్రధాన కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను పర్యవేక్షించారు. గణేష్ విగ్రహాల నిమజ్జనం చేసే మినీ ట్యాంక్ బండ్ ను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించి నిర్వహకులకు భద్రతాపరమైన సూచనలు చేశారు. మక్తల్ పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలు పోలీసు శాఖ ఇచ్చిన నిబంధనలకు అనుగుణంగా ఉండాలి అని తెలిపారు. మండపాల వద్ద అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.సీసీ కెమెరాల ఏర్పాట్లును పరిశీలించారు. సమస్యలు ఉంటే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం నిమజ్జనం రోజు తీసుకోవాల్సిన నిబంధనలు, ఆంక్షలు పాటించాలని, ఏలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా శాంతియుత వాతావరణంలో శోభయాత్ర సాగేలా పోలీసులకు సహకరించాలని కోరారు. అధికారులకు బందోబస్తు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని, ఆజాద్ నగర్ మండపం వద్ద ఏర్పాటు చేసిన పాయింట్ బుక్ ను డీఎస్పీ గారు తనిఖీ నిర్వహించారు. అధికారులు రాత్రి సమయంలో నిరంతరం పాయింట్ బుక్కులు తనిఖీ చేస్తూ మండపాల వద్ద వాలంటీర్సులను ఉండేటట్లు చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శీనన్న చొరవతో మున్నేరు నిర్వాసితులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు

## - ప్రతిపక్షాలు వరదల పై బురద రాజకీయాలను మానుకోవాలి
## - హైడ్రా పెట్టిందే కబ్జాదారుల ఆటకట్టించడానికి
## - మల్కాజ్ గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు
## - నాయుడుపేట, జలగంనగర్ వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు : మంత్రి పొంగులేటి శీనన్న చొరవతో మున్నేరు నిర్వాసితులందరికీ ఇళ్ల స్థలం లేదా డబుల్ బెడ్ రూం ఇళు వస్తాయని, వరదల పై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న బురద రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మల్కాజ్ గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను ప్రవేశపెట్టిందే కబ్జాదారుల ఆటకట్టించడానికి అని తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేట, జలగం నగర్ లోని వరద బాధితులకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తో కలిసి నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అడ్డగోలు అనుమతులు ఇవ్వడం ద్వారానే అనేక మంది పేదలు ఈనాడు వరద బాధితులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలు ప్రత్యక్షంగా వచ్చి పేదల బాధలను చూసి చేతనైనా సాయం చేయాలని హితవు పలికారు. అంతే తప్ప వరదలను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కల్లెం వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్లపూడి భద్రకాళి, మాజీ సర్పంచ్ లు బండి జగదీశ్, మద్ది వీరా రెడ్డి, అజ్మీరా అశోక్ నాయక్, సురేష్ నాయక్, మెండె వెంకటేశ్ యాదవ్, అంబటి సుబ్బారావు, తమ్మినేని నవీన్, బానోతు హరి, వెంకట నారాయణ, రానేరు మురళీ, కరాటే వేణు, బానోతు సాయి, గుగులోతు శ్యాం తదితరులు పాల్గొన్నారు.

# జెండా ఆవిష్కరణలో కీలక బాధ్యులు

## - మరో ఉద్యమానికి సేవలాల్ సేన సమాయత్తం : సేవాలాల్ సేన రాష్ట్ర బాధ్యులు

పాల్వంచ, తెలంగాణ ముచ్చట్లు : పాల్వంచ గిరిజన సంక్షేమ భవన్ లో సేవాలాల్ సేన 10 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా కీలక నేతలు జెండా ఆవిష్కరణ చేశారు. మొదట మేరమ్మ యాడికి, సేవా లాల్ మహారాజ్ కి పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లా యువసేన అధ్యక్షులు భరత నాయక్, పరమేష్ నాయక్ ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిదులుగా ఉద్యోగ సంఘ రాష్ట్ర నాయకులు సపావత్ బాలకృష్ణ చౌహాన్ ( టీటీఎఫ్ ), కేటీపీఎస్ గిరిజన ఉద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర కోశాధికారి దుర్గా ప్రసాద్ నాయక్, జిల్లా అధ్యక్షులు మాలోతు శివ నాయక్ లు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ... సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు సంజీవ నాయక్ నాయకత్వంలోఅనేక సమస్యలపై పోరాటాలు చేసి, పట్టుదలతో విజయాలను సాధించుకోవడం జరిగిందన్నారు. జాతిని ఏకతాటిపై తెచ్చి, హక్కులు, చట్టాలను కాపాడుతామని శపథం చేశారు. గిరిజన జాతి మహిళలకు రక్షణ కల్పించడంలో తమ సంఘం ప్రధాన భూమిక పోషిస్తుందని తెలిపారు. భూక్య సంజీవ నాయక్ నేతృత్వంలో 2015 లో ఏర్పడ్డ సేవాలాల్ సేన ఈ దశాబ్ద కాలంలో ఎన్నో విజయాలు సొంతం చేసుకున్నట్లు స్పష్టం చేశారు.



# వరద బాధితులకు అండగా వర్ధన్నపేట ఎమ్మెల్యే

హసన్ పర్తి తెలంగాణ ముచ్చట్లు : ముఖ్యమంత్రి సహాయ నిధికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఒక నెల వేతనం విరాళం ప్రకటించారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సర్వస్వం కోల్పోయి అల్లాడుతున్న రాష్ట్ర ప్రజలను ఆదుకోవడానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ విపత్కర పరిస్థితుల్లో బాధితులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని, అందుకే తన వంతుగా నెల జీతం 2,75,000 రూపాయలు విరాళంగా అందజేస్తున్నట్లు ఒక ప్రకటన లో తెలియజేశారు.




# వరద బాధితులకు ఉచిత గ్యాస్ స్టవ్ రిపేర్ కార్యక్రమం

ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :జమాఅతె ఇస్లామి హింద్ ఖమ్మం శాఖ ఆధ్వర్యంలో ఇస్లాంపేట ఆఫీసు నందు ఉచిత గ్యాస్ స్టవ్ రిపేర్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వెంకటేశ్వర నగర్లో వర్షాల నేపథ్యంలో వరదలు వచ్చి గ్యాస్ స్టవ్ సర్వం పాడైపోయింది అటువంటి వారి కోసం ఉచిత గ్యాస్ స్టవ్ రిపేర్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఇస్లాంపేట అధ్యక్షుడు షేక్ రఫీ అన్నారు. త్రీ టౌన్ అన్ని ఏరియాలో ఐదు రోజులు నిర్వహించబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు షేక్ ఫయాజ్ మహమ్మద్ గౌస్, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు

# ముంపు బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది

## -జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఉమ్మడి ఖమ్మం, బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు : ముంపు బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో వైరా రిజర్వాయర్ లోతట్టు ప్రాంతాలు, మున్సిపాలిటీ లోని నాలుగో వార్డ్ లో వరద ముంపు గురైన కాలనీలను కలెక్టర్ సోమవారం పరిశీలించారు. వరద ముంపు ప్రాంత వాసులతో మాట్లాడారు. రిజర్వాయర్ ను ఆనుకొని ఉన్న రాజీవ్ నగర్ కాలనీ రిజర్వాయర్లో తెప్పపై ప్రయాణించి కాలనీలోని సహాయక చర్యలను కలెక్టర్ పరిశీలించారు. వరద తగ్గేవరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉండాలని అన్నారు. అధికారులు, సిబ్బంది సూచనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. వసతి గృహంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో సౌకర్యాలు మంచిగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వర్షాలు పడుతున్నట్లు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలం కాబట్టి సీజనల్ వ్యాధుల ప్రమాదం పొంచి ఉందని, నిర్లక్ష్యంగా ఉండవద్దని అన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమీషనర్ వేణు, రెవెన్యూ అధికారులు, మండల అధికారులు తదితరులు ఉన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

# చంద్రబాబు నాయుడుకు మంచి ఆరోగ్యం ప్రసాదించాలి

## - వాడవాడల కొలువు దీరిన గణనాథులు



మంత్రాలయం, తెలంగాణ ముచ్చట్లు : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు మంచి ఆరోగ్యం ప్రసాదించాలని, వరద బాధితులు త్వరగా కోలుకోవాలని వినాయకునికి ప్రార్ధించినట్లు టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి అన్నారు. సోమవారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం లో వాడవాడల మంటపాల్లో గణనాథులు కొలువు దీరారు. ఈ సందర్భంగా గణనాథులు కొలువైన మంటపాలను సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. గ్రామ ప్రజలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో కొలువైన రామచంద్ర నగర్ లో ఐదు, అన్నపూర్ణ భోజన శాల దగ్గర ఉన్న ఒకటి, సంత మార్కెట్ లో నాలుగు, స్టేట్ బ్యాంక్ లైన్ లో ఉన్న ఒకటి, పాత ఊరిలో రెండు మంటపాల్లో కొలవుదీరిన గణనాథులను టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ హారతి ఇచ్చారు. ఒక్కోక్క వినాయక మండలి కి రూ రెండు వేల రూపాయలు చొప్పున నగదు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుని ఆశీస్సులు ప్రజల అఓదరిపై ఉండాలని, సుఖసంతోషాలు జీవించాలని పూజించారు. వీరి వెంట, టిడిపి నాయకులు విజయ రామిరెడ్డి, గురురాజ శెట్టి, వట్టేప్ప నర్సింహులు, సుంకప్ప, సున్నం రామకృష్ణ, రాఘు, వనికే నాగరాజు, వట్టేప్ప రాఘు,సంత మార్కెట్ పాఠశాల స్కూల్ ఛైర్మెన్ గురురాజ, వట్టేప్ప భీమ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ హారతి ఇచ్చారు. వీరి కి వినాయక సమితి సభ్యులు శాలువ కప్పి సన్మానించారు.

# భౌగోళికరాయలసీమలోదళిత బహుజన రాజ్యాధి కారము రావాలి

## -బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు



ఆదోని, తెలంగాణ ముచ్చట్లు : సోమవారం నాడు ఎస్.సి ఎస్.సి. ఎన్.టి బి.సి.కులాల కు రాజ్యాధికారం, మరియు ,దగాపడ్డ రాయలసీమ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు అధ్యక్షతన హెూటల్ భీమాస్ ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేయడం అయినది. ఈ సమావేశములో బీసీ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పి.సాయి బాబా, డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. షేక్ శావలి,గౌరవ సలహాదారుల దేవిశెట్టి ప్రకాష్, తాలూకా అధ్యక్షులు మరియాని చెన్న బసప్ప, వైస్ ప్రెసిడెంట్ మాన్వి దేవేంద్రప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు వీరు మాట్లాడుతూ యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి రావాలని పిలుపునివ్వడమైనది. 1. భౌగోళిక రాయలసీమలోదళిత బహుజనుల రాజ్యాధికారం కావాలి ,2. నీళ్లు నిధులు నియామకాలు, మరియు ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. 3. రాయలసీమ రాజకీయ పార్టీల నిర్లక్ష్యంతో దగాపడ్డ రాయలసీమను ప్రత్యామ్నాయ రాజకీయాల ద్వారాఅభివృద్ధి చేయాలి, 4. ఆదోని రెవెన్యూ డివిజన్ ని ఆదోని జిల్లాగా ప్రకటించాలి. 5. తెలంగాణ, కర్ణాటక,ఆంధ్రప్రదేశ్, మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం ఆదోని కావున విద్య అభివృద్ధి కోసం ఆదోనిలో యూనివర్సిటీ స్థాపించాలి. ఈ ఐదు అంశాలపై మాట్లాడుతూ సాధించే వరకు పోరాటాలు చేస్తూనే ఉంటాం అని తీర్మానించడంఅయినది. ఈ సమావేశంలో బి.సి.ఫెడరేషన్ నాయకులు పట్టణ అధ్యక్షులు డాక్టర్ వీరేష్ ధనాపురం శేషన్న, మలేకర్ శ్రీనివాసులు, మహాదేవప్ప, డాక్టర్ యు సోమశేఖర్ కపటి వీరభద్ర,బి.రాముడు,ఆదోని పట్టణ బెస్త సంఘం నాయకులు ప్రకాష్,బి మల్లేశ్వరప్ప ప్రసాద్, రిటైర్డ్ టీచర్ రామలింగయ్య, బండారి రాజేశ్వరరావు, దీపక్ నల్లారెడ్డి, చిన్న ఈరప్ప ఉరుకుందు,, నరేష్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు

# ముంపు బారిన పడిన ప్రజలను అహర్నిశలు సంరక్షిస్తున్న జిల్లా యంత్రాంగం



మంది ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్ సిబ్బందిని రప్పించి వారి ద్వారా వరద బాధిత ప్రజలకు సేవలందిస్తున్నారు. బందరు డివిజన్లోని చల్లపల్లి, నాగాయలంక, మోపిదేవి, కోడూరు, అవనిగడ్డ, పెడన మండలాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా గుడివాడ డివిజన్లో గన్నవరం, ఉంగుటూరు, పెదపారుపూడి, నందివాడ, బాపులపాడు, గుడివాడ మండలాలు, ఉయ్యూరు డివిజన్లో పెనమలూరు, కంకిపాడు, పమిడిముక్కల, తోట్లవల్లూరు మండలాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలాలకు, గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించి ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టడంతో పాటు పునరావాస కేంద్రాల్లో కూడా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేస్తూ నిరంతర పర్యవేక్షణ చేయించారు. జల వనరుల శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ అప్రమత్తం చేసి ఎక్కడైన పంట కాలువలు, డ్రైనేజీ, కరకట్టలు తెగిన పక్షంలో వెంటనే అడ్డుకట్ట వేసే విధంగా కావలసినన్ని ఇసుక బస్తాలు సిద్ధం చేశారు. జిల్లాలో భారీ వర్షాలు మొదలైనప్పటి నుండి కలెక్టరేట్ తో పాటు రెవెన్యూ డివిజన్, మండల కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ విభాగాలను ఏర్పాటు చేసి 24/7 విధానంలో నిరంతరం పనిచేసే విధంగా జిల్లా యంత్రాంగాన్ని సిద్ధం చేశారు. ఏ ఫోన్ కాల్ వచ్చినా సంబంధిత అధికారులకు తెలియజేసి వెంటనే తగిన చర్యలు తీసుకునేలా ఏర్పాటు చేశారు. కృష్ణా నది పరివాహక ప్రాంతాలతో సహా బుడమేరు వలన ముంపుకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఒక్క ప్రాణ నష్టం కూడా జరగకుండా చేశారు. బుడమేరుపై ఉన్న 9 వంతెనల వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బందిని కాపలా ఉంచి ఏ విధమైన రాకపోకలు లేకుండా అడ్డుకొని ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా కాపాడగలిగారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మచిలీపట్నం మండలంలోని మంగినపూడి సముద్ర తీరంవద్ద గల తాళ్లపాలెం గ్రామం వైఎస్ఆర్ కాలనీ మత్స్యకారులతో మాట్లాడి వారిని ఒప్పించారు.

# ప్రశ్నిస్తే తప్ప పనులు చేయరా...

## - 100 రోజుల ప్రణాళిక లక్ష్యాలను అధిగమించండి

## - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





నంద్యాల,తెలంగాణ ముచ్చట్లు : ఉపాధి హామీ పనుల లేబర్ బడ్జెట్, ఇళ్ల నిర్మాణాల పురోగతి, పంట నష్ట నమోదు, ఈ క్రాప్ బుకింగ్, ఓడిఎఫ్ ప్లస్ సర్వే తదితర అంశాలలో నిర్దేశించిన ప్రగతి లక్ష్య సాధనలో కొంతమంది మండల క్షేత్రస్థాయి అధికారులు తక్కువ ప్రగతి సాధిస్తున్నారని ప్రశ్నిస్తే తప్ప పనులు చేయరా అని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్లోని సెంటనరీ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా క్షేత్రస్థాయిలో 100 రోజుల పనుల ప్రగతిపై లక్ష్యాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లా ప్రగతి లక్ష్యసాధనలో అప్పగించిన పనులు పూర్తి చేయడంలో అలక్ష్యం చేస్తున్నారని. ఏ ఒక్క అధికారికి నేను ముందుండాలి అనేది ఉండదా..? అని కలెక్టర్ ప్రశ్నిస్తూ మనసు పెట్టి పని చేయాలని అధికారులను ఆదేశించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఉపాధి హామీ పనులకు కేటాయించిన లేబర్ బడ్జెట్ ఆత్మకూరు క్లస్టర్ పరిధిలోని అన్ని మండలాలలో తక్కువగా ఉందని... పనితీరు మెరుగుపరచుకొని నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల తదితర మండలాలలో ఉపాధి హామీ కింద 1,100 ఎకరాలలో చేపట్టిన పండ్ల తోటల పెంపకాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అవెన్యూ, ఇన్స్టిట్యూషనల్, బ్లాక్ ప్లాంటేషన్ కింద మొక్కల పెంపకానికి సంబంధించి పిట్టింగ్, కంచే ఏర్పాటు... ప్రతిదానికి ఉపాధి హామీ కింద డబ్బులు ఇచ్చినా పనులు ఎందుకు చేయడం లేదని కలెక్టర్ ప్రశ్నించారు. ఇళ్లు నిర్మాణంలో ఉన్నప్పుడు 90 రోజుల పని దినాలకు సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్ అడగాల్సిన అవసరం లేదని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేయాలని పంచాయతీ రాజ్ ఎస్ఈని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ ప్రగతికి సంబంధించి ప్రతి మండలంలో రోజుకు రెండు ఇళ్ళు పూర్తి స్థాయి, పది ఇళ్ళు స్టేజ్ కన్వర్షన్ కు తీసుకురావాలని ఆదేశించినప్పటికీ అత్యల్ప ప్రగతి చూపుతున్నారన్నారు. వందరోజుల ప్రణాళికలో 3,413 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యం కాగా ఇప్పటివరకు కేవలం 608 ఇళ్లు మాత్రమే పూర్తి చేయగలిగారన్నారు. కొత్తపల్లి, నందికొట్కూరు, పగిడ్యాల, బేతంచెర్ల, ప్యాపిలి తదితర మండలాలలో తక్కువ ప్రగతి కనిపిస్తోందని ఈ వారం చేస్తామని ప్రతిసారి చెప్పడం సరికాదని కలెక్టర్ తెలిపారు. అన్నం పెట్టే రైతుకు సపోర్ట్ ఇచ్చేందుకు పంట నష్ట వివరాలను మంగళవారం ఉదయంలోగా నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ వ్యవసాయ రంగ అనుబంధ రంగాల అధికారులను ఆదేశించారు. 4.6 లక్షల ఎకరాలకు సంబంధించి 1.2 లక్షల రైతుల ఈ కేవైసి సంబంధించి కేవలం 41 వేల మందికి మాత్రమే పూర్తి చేశారని ఇంకా 1.10 లక్షల మంది రైతుల ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉందని ఇందుకు సంబంధించి గ్రామ వ్యవసాయ అధికారులు, వీఆర్వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గోస్పాడు, బనగానపల్లి, శిరివెళ్ల, బండి ఆత్మకూరు తదితర మండలాలలో తక్కువ ప్రగతి ఉందని పంట నష్ట నమోదు, ఈక్రాప్ బుకింగ్ ఏకకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద పెండింగ్ లో వున్న దరఖాస్తులు పరిశీలించి వాస్తవ నివేదికలను వెంటనే పంపాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను ఆదేశించారు. డేటా బేస్ ప్రకారం పల్స్, ఓడిఎఫ్ ప్లస్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. 151 సంక్షేమ వసతి గృహాల్లో తనిఖీల నిమిత్తం స్పెషల్ అధికారులను నియమించామని సంబంధిత అధికారుల నివేదిక ఆధారంగా హాస్టల్లో అన్ని మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు.క్రమ పద్ధతిగా వినియోగించుకుంటూ వసతి గృహాలను, ఆదేశించారు.

# బుడమేరులో అక్రమణాలను తొలగించి ప్రక్షాళన చేయాలి

## -అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

## - రాష్ట్ర కౌలు సంఘం ప్రధాన కార్యదర్శి జమలయ్య, సిపిఐ నేత తాతయ్య






నందివాడ,తెలంగాణ ముచ్చట్లు : నందివాడ మండలంలో వరద ముంపునకు గురైన లోతట్టు ప్రాం తాలైన చిన్నలింగాల, పెద్దలింగాల, పుట్టగుంట, చేదుర్తిపాడు ఒద్దులు మేరక రామపురం, కుదరవల్లి, ఇల్లపర్రు, తదితర లోతట్టు ప్రాంతా లను సోమవారం రాష్ట్ర కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి టీ తాతయ్యలు పర్యటించారు.. అధిక వర్షాల వలన నీట మునిగిన పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కౌల్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జయలయ్య, సిపిఐ జిల్లా కార్యదరి టి. తాతయ్యలు మాట్లాడుతూ ప్రకృతి విపత్తును రాష్ట్ర ప్రభుత్వాలు వాతావరణ శాఖను డ్రైనేజీ వ్యవస్థను స్ట్రీమ్ లైన్ చేసి ముందుగా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రకృతి విపత్తు వలన నష్టపోయిన పంటని ఎన్యుమరేషన్ చేసి రైతులు తాలూకా వాస్తవ పంట నష్టాన్ని అధికారులు అంచనా వేయాలన్నారు. బుడమేరలో ఉన్న అక్రమణలు యుద్ధపాతికన తొలగించి ముంపు నుండి ప్రజలను రక్షించాలి. ఎనికేపాడు, సురంపల్లి, మంతేన, తేన్నేరు, ఉంగుటూరు, పుట్టగుంటలో ఉన్న వంతెనలను ఎత్తు పెంచి, అధిక సంఖ్యలో ఖానాలను పెంచి ముంపు నుండి రైతులను కాపాడలన్నారు. ప్రతే ఏడాది బుడమేరు, కోల్లేరు, కల్వలో ఉన్న గుర్రపు డెక్కతో పాటు తూడును కూడ తొలగించాలన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసేటప్పుడు రైతులు కౌలు రైతులను భాగస్వామ్యం చేసి పంట నష్టాన్ని అంచనా వేయలన్నారు. 2014లో నిర్ణయించిన విధంగా కాకుండా పెరిగిన ధరలకు అనుకూలంగా వరి పంటకు రూ .ఇరవై ఐదు వేలు, వ్యాపార పంటకు లక్ష రూపాయలు, వ్యవసాయ కూలీలకు కుటుంబాలకు రూ. పదివేల చొప్పున నిర్ణయించి ప్రభుత్వమే చెల్లించాలన్నారు. ఇప్పటికే బ్యాంకుల ద్వారా రైతులు తీసుకున్న రుణాలను రద్దు చేసి, భీమా పథకాలు వర్తింపజేసి, ఉచితంగా ఎరువులు విత్తనాలు రైతులకు అందజేయాలన్నారు. ఈ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్రానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రాప్తో సంబంధం లేకుండా రెవిన్యూ అధికారులు ఫీల్డ్ లోకి వచ్చి రైతులను, కౌలు రైతులను గుర్తించి ఎన్యుమరేషన్ చేసి పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి ఇవ్వాలన్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు, వరదలకు ఈ ప్రాంతంలో ఉన్నటువంటి రైతాంగం తీవ్రంగా నష్టపోయారు.



# వరద బాధితుల సహాయార్థం రూ.కోటి విలువైన 10వేల కిట్లు సిద్ధం

కర్నూలు, తెలంగాణ ముచ్చట్లు : విజయవాడ వరద బాధితుల కోసం రూ.కోటి విలువైన 10వేల నిత్యావసర సరుకుల కిట్లు సిద్ధం చేసినట్లు మంత్రి టీజీ భరత్,టిడిపి కర్నూల్ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి తెలిపారు, టిడిపి ఎమ్మెల్యేలు,నియోజకవర్గ ఇన్చార్జి లు,నాయకుల సహకారంతో వీటిని తయారు చేసినట్టు చెప్పారు.ఒక్కో కిట్ లో 5కేజీల బియ్యం,కేజీ కందిపప్పు,కేజీ చక్కెర.ఉప్మారవ్వ,కారంపొడి,తదితర వస్తువులు ఉన్నాయన్నారు.

# ఒక వ్యక్తిని రక్షించిన పోలీస్ సిబ్బంది



ఆలమూరు, తెలంగాణ ముచ్చట్లు : మానసిక స్థితి సరిగా లేక ఆత్మహత్య చేసుకునేందుకు జొన్నాడ – రావులపాలెం గౌతమి గోదావరి వంతెన వద్దకు వచ్చిన కడియం మండలం పొట్టిలంక గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి మణికుమార్ (28) అనే వ్యక్తిని ఆలమూరు పోలీసులు రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు ప్రకారం మణికుమార్ కు మానసిక స్థితి సరిగా లేక గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో గోదావరి వంతెన పై కాలినడకన సంచారిస్తుండగా విషయం తెలుసుకున్న రూరల్ సిఐ విద్యాసాగర్ హైవే పోలీస్ సిబ్బందికి సమాచారం అందించారు. స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నెహ్రూ, హైవే పోలీస్లు వెన్నేటి సాయికుమార్, జి.వి.ఎస్.ఎన్ మూర్తి కలిసి పరిసర ప్రాంతాలను గాలించి ఆత్మహత్యకు యత్నిస్తున్న వ్యక్తిని అడ్డుకున్నారు. పోలీసులు అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సిఐ విద్యాసాగర్ కు,ఆలమూరు పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# వినాయక నిమజ్జనం సందర్భంగా రస్న, వాటర్ ప్యాకెట్లు పంపిణీ

## - మతసామరస్యతను చాటిన క్రైస్తవులు,ముస్లింలు



ఎమ్మిగనూరు, తెలంగాణ ముచ్చట్లు : వినాయక చవితి పండగ పురస్కరించుకొని సోమవారం వినాయక నిమజ్జనం సందర్భంగా కులమతాలకు అతీతంగా మతసామరస్యతను చాటుతూ క్రైస్తవులు, ముస్లింల ఆధ్వర్యంలో... మల్లెల గ్రూప్స్ అధినేత డా. మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు ఆధ్వర్యంలో... ఎమ్మిగనూరు పట్టణంలో... స్టేట్ బ్యాంకు సర్కిల్ దగ్గర ప్రజలకు రస్న, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా పోలీస్ శాఖ అధికారులతో పాటు టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వి.జి.ఏ.దయ సాగర్, టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న,మాజీ ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులును ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర ఉపాధ్యక్షులు లాల్ కోట ఖదీర్ భాష, ఐడియల్ యూత్ మూమెంట్ పట్టణ అధ్యక్షులు ముల్లా ఇస్మాయిల్, పాల్గొన్నారు.

# విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంస్కృతీ దీక్ష యజ్ఞం

## - కార్యక్రమంలో పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ ముఖ్య నాయకులు



ఎమ్మిగనూరు, తెలంగాణ ముచ్చట్లు :ఎమ్మిగనూరు మండలం పార్లపల్లి గ్రామంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంస్కృతీ దీక్షా యజ్ఞం నిర్వహించడం జరిగింది. ధర్మ ప్రచార ప్రాంత ప్రముఖ్ అనంత విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరు పాటించాలని,మన సంస్కృతి,సాంప్రదాయాలను మన పిల్లలకు అందించాలని, వారానికి ఒకసారి సత్సంగం నిర్వహించాలని కోరారు. కర్నూలు జిల్లా విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షులు న్యాయ కంటి భీమిరెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను బాల గంగాధర్ తిలక్ ప్రారంభం చేసారు.ప్రతి ఒక్కరు వినాయక చవితి ఉత్సవాలను బాలగంగాధర్ తిలక్ ఎందుకు ప్రారంభం చేశారో యావత్ సమాజం తెలుసుకోవాలి.గణేష్ ఉత్సవాలు విలాస నృత్యాలకు, పరిహాస కార్యక్రమాలకు కాకుండా దేశ,ధర్మరక్షణకు వేదికలు కావాలని అన్నారు . మన దేశాన్ని విదేశీయుల నుండి,విదేశీ పాలన నుండి విముక్తి కల్పించుటకై మనలో ఐక్యమత్యం,దేశభక్తి,క్రమశిక్షణ, జ్ఞానం పెంచుటకు లోకమాన్య బాలగంగాధర్ తిలక్ వినాయక ఉత్సవాలను మొట్టమొదట ప్రారంభం చేసారు.ప్రతి ఒక్కరు మన హిందూ ధర్మం గొప్పతనం గురుంచి తెలుసుకొని మన హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరు పాటించాలని మన పూర్వీకులు మనకు అందించిన సనాతన ధర్మాన్ని పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఆదోని జిల్లా సంఘటన కార్యదర్శి మేకల నల్లన్న,ఆదోని జిల్లా ధర్మప్రసార ప్రముఖ్ వాల్మీకి సీతారామయ్య, ధర్మప్రసార ప్రాంత సహ ప్రముఖ్ అంకాలయ్య,ఎమ్మిగనూరు మండల ధర్మరక్షక్ మహేష్ శర్మ, జిల్లా గోరక్ష ప్రముఖ్ శ్రీరామ యాదవ్,జిల్లా ప్రచార ప్రముఖ్, ఉపేంద్రరెడ్డి,ఎమ్మిగనూరు ప్రఖండ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు .

# విద్యాకాషాయకరణ,కార్పొరేటీకరణ కు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

## - ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్
## - ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభం



దేవనకొండ, తెలంగాణ ముచ్చట్లు : విద్యా కాషాయకరణ, కార్పొరేటీకరణ కు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ నిరంతరం విద్యారంగ సమస్యలపై పోరాడుతుందన్నారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో పాలుపంచుకొని, బ్రిటిష్ పరాయి పాలకుల చెరసాలలో మగ్గుతున్న భారతదేశానికి విముక్తి కావాలని, పోత్తిళ్లలోనే పిడికిలెత్తి నినాదించిందన్నారు. చదువు పోరాడు అనే నినాదంతో, ప్రజాస్వామ్యం సోషలిజం లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. ఇప్పటివరకు పేద, బడుగు,బలహీన వర్గాల విద్యార్థులకు అండగా ఉండి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులను సంఘటితం చేస్తూ అనేక పోరాటాలు నిర్వహించి ఎన్నో విజయాలను అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) సొంతం చేసుకుందని తెలిపారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానం పేరుతో విద్యా కాషాయకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు తెరలేపిందని విమర్శించారు. విద్యారంగంలో అనేక మార్పులు తీసుకొస్తామని చెప్పి, శాస్త్రీయమైన అంశాలను తొలగించి, అశాస్త్రీయమైన భావజాలాన్ని పాఠ్యాంశాలుగా చేర్చి, విద్యార్థుల మెదళ్లను మరింత అజ్ఞానంలోకి నేడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న సమరయోధుల జీవిత చరిత్రలను పాఠ్యాంశాలుగా ఉన్న వాటిని తొలగించి, బ్రిటిష్ పరాయి పాలకులకు తొత్తుగా వ్యవహరించిన వారి యొక్క జీవిత చరిత్రలను పాఠ్యాంశాలుగా చేరుస్తున్నారని ఆరోపించారు. జాతీయ నూతన విద్యా విధానం పేరుతో 1,2,3 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేసి,ప్రాథమిక పాఠశాలలను మూసివేశారని, దీంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2500 పైగా ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసి విద్యార్థులకు భోజనాన్ని అందించేవారని, ఆ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం తొలగించి పేద విద్యార్థుల కడుపులు మార్చారని అన్నారు. తక్షణమే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న పథకాన్ని అమలు చేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు దుర్భారమైన పరిస్థితుల్లో ఉన్నారని, వారి యొక్క సమస్యలను స్పందించి, పరిష్కరించలేని పరిస్థితుల్లో ఉన్నతాధికారులు ఉన్నారని, కావున విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఏఐఎస్ఎఫ్ నిరంతరం ఉద్యమిస్తుందని, ఈ ఉద్యమంలో విద్యార్థులానంతా భాగస్వాములను చేసేందుకు అట్టహాసంగా ఏఐఎస్ఎఫ్ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ప్రతి విద్యార్థి ఏఐఎస్ఎఫ్ సభ్యత్వం తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష,కార్యదర్శులు మధు,భాస్కర్ నాయకులు ఉమేష్,సురేంద్ర,రవి,మహేష్,శివ తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడిలో వినాయకుడు




ఆత్మకూరు, తెలంగాణ ముచ్చట్లు : శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆత్మకూరు పట్టణములోని అమ్మవారి శాలలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం ర్యాలీని ప్రారంభించారు. ఈ నిమజ్జన వేడుకలలో. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.మొదటగా ఆత్మకూరు పట్టణంలోని అమ్మవారి శాల ప్రారంభమైన ర్యాలీ ఆత్మకూరు పట్టణ పురవీధుల గుండా ఎర్ర గూడూరు గ్రామము వద్ద తెలుగు గంగ కాల్వ వద్ద ఏర్పాటుచేసిన నిమజ్జనం. వేదికకు తరలి వెళ్లి ఉన్నారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున హిందువులు మేళ తాళాలతో డప్పులతో పాల్గొన్నారు.




# నందికొట్కూరు పట్టణములోని ఏకలవ్య నగర్ లో శాలు హత్య

ఆత్మకూరు,తెలంగాణ ముచ్చట్లు : నందికొట్కూరు పట్టణంమారుతీ నగరంలోని శాలు బీ అనేమహిళను గత గురువారం రాత్రి హత్య చేసిన విషయము పాఠకులకు విధితమే. ఈ కేసులో ఆదివారం నిందితులను అరెస్టు చేసి రిమాండ్కు పంపినట్లు ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ హత్యకు గురి అయిన శాలు బి గతంలో 2010లో చాలు బి వామే స్నేహితురాలు రేష్మ కలిసి వడ్డే లక్ష్మీనరసింహను హత్య చేశారన్నారు. నేడు లక్ష్మీనరసింహ కుమారుడు. తన తండ్రిని హత్య చేసిన చాలుబీని ఎలాగైనా హతమార్చాలని అందుకు ప్రతీకారంగా అతని మిత్రులు వెంకటరమణ.మనోజ్ కుమార్.వెంకటేశ్వర్లు. డిఎల్ బాల నేరస్థుడు శాలుబినిచంపాలని అన్నారు. డీఎస్పీ తెలిపారు. గురువారం అర్ధరాత్రి వేళ శాలుబి ఇంటికి వెళ్లి నిందితులు గొడ్డలితో గేటును చెక్క తలుపులను పగులగొట్టి ఇంటి లోపలికి మారణ ఆయుధాలతో అక్రమంగా వెళ్లి శాలుబి కొడుకును మౌలాలిని భయపెట్టి పింజారి శాలుబీని అతి కిరాతకంగా గుడ్డలి నాటు తుపాకులతో హత్య చేశారని తెలిపారు. ఈ హత్యలో బీహార్ కు చెందిన మనోజ్ కుమార్. మరొక బాల నేరస్తుడు తప్పించుకోవడంతో అతన్ని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నిందితులను ఆదివారం పట్టణ శివార్లలో ఉన్నారని సుబ్రహ్మణ్యం తన సిబ్బందితో అరెస్టు చేశామన్నారు. నిందితుల వద్ద ఉన్న రెండు నాటు తుపాకులు గుడ్డలిని స్వాధీనం చేసుకొని రిమాండ్కు పంపించామన్నారు. లక్ష్మీనారాయణ. తిరుపాలు. ఓబులేసు. శరత్ కుమార్ రెడ్డి లను నంద్యాల జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రానా. అభినందించారని తెలిపారు. కానిస్టేబుల్ చెన్నయ్యను. ఓబులేసును. హెూంగార్డు గోపాల్ ను. డీఎస్పీ వారికి రివార్డును అందించారు.

# మంగళవారం నుండి ఈర్లదిన్నెలో తితిదే ధార్మిక కార్యక్రమాలు

## - డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే



కౌతాళం, తెలంగాణ ముచ్చట్లు : తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కౌతాలం మండలం, ఈర్లదిన్నె గ్రామం లోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం నందు జయదేవానంద స్వామీజీచే మంగళవారం నుండి శుక్రవారం వరకు మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబందించిన కరపత్రాలను స్థానిక భజన మండలి సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తి.తి.దే. ధర్మ ప్రచార మండలి సభ్యులు న్యాయకంటి భీమిరెడ్డి, శ్రీవారి సేవకులు ఆర్.సోమిరెడ్డి, కందుస్వామి, జి. మధుసూధన రెడ్డి, వి.ఉమేశ్ స్వామి, హెచ్.లక్ష్మీరెడ్డి, బి.లింగన్న, కె.రాఘవ రెడ్డి, కె.వీరేశ్, సి.బుసప్ప, బి.ఈరన్న, జి.ప్రహ్లాద రెడ్డి, బి.నరసయ్య, యం.ఉసేని, బి.జంగఉసేని, ఎన్.లక్ష్మీకాంత రెడ్డి, సి.వి.గిరిస్వామి, కె.జనార్ధన్ రెడ్డి, కె.దశరథ రెడ్డి, బి.వెంకోబ, పి. మౌళాలి, యం.నర్సన్న, యం. అలంషా, కె.సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

# పేద కళాకారులకు సమాఖ్య ఫించన్లు పంపిణీ

గుడివాడ,తెలంగాణ ముచ్చట్లు : గత రెండు సంవత్సరాలుగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కళాకారులను అదుకునేందుకు కళాకారుల సమాఖ్య ముందుకు వచ్చి ఫించన్లు అందించడం అభినందనీయమని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ జవ్వాజి గంగరాజు అన్నారు. సోమవారం కళాకారులు సమైఖ్య ఆధ్వర్యంలో సభ్యులు 20 మంది పేద కళాకారులకు రూ. 1000 చొప్పున అందించడం జరిగింది. డైట్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ అంజనేయులు, సమాఖ్య అధ్యక్షుడు విన్నకోట సత్యనారాయణ(బుజ్జి), గౌరవ అధ్యక్షుడు బి.వి రామమోహనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# జిల్లాలో ఫోటో ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన

## - జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం,తెలంగాణ ముచ్చట్లు : జిల్లాలో ఫోటో ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన కార్యక్రమం ఈనెల 21 వ తేదీ వరకు కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ప్రకారం ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం - 2025 లో భాగంగా గత ఆగస్టు నెల 21 వ తేదీ నుండి ఫోటో ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన కార్యక్రమం బూతు స్థాయి అధికారులు నిర్వహిస్తున్నారన్నారు. ఓటర్ల జాబితాలో గాని, ఓటరు గుర్తింపు కార్డులో గాని తేడాలను ఈనెల 28 వ తేదీ నాటికి తొలగించడం జరుగుతుందన్నారు. అలాగే ఈనెల 28 వ తేదీ నాటికి ఫోటో ఓటర్ల జాబితాలోని సరిగా లేని ఫోటోల స్థానంలో బాగా నాణ్యత గల ఫోటోలను అప్లోడ్ చేయడంతో పాటు మానవ చిత్రాలు లేనివి తీసేసి సరైన చిత్రాలను పొందుపరచడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఈనెల 28 వ తేదీ లోగా వయసుకు తగిన విధంగా భావి జనాభాను ఈఆర్వో.నెట్లో తాజాగా రూపొందించడం జరుగుతుందన్నారు. ఏమైనా అంతరాలు ఉంటే గుర్తించి వాటిని సరి చేయడానికి ఈనెల 28 వ తేదీలోగా సరి చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 13 వ తేదీలోగా అన్ని పోలింగ్ కేంద్రాల భవనాలను భౌతికంగా తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఈనెల 18 తేదీ నాటికి పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ గాని పునః ఏర్పాటు గాని చేస్తామన్నారు. ఈనెల 18 వ తేదీ నుండి మొదలుపెట్టి 23 వ తేదీ నాటికి భాగాలు, విభాగాల వివరాలను సరి చేస్తామన్నారు. ఈనెల 28 వ తేదీ నాటికి ప్రతిపాదనలు సిద్ధం చేసి రాజకీయ పార్టీలకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈనెల 30 వ తేదీ తేదీన జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులతో సమావేశం నిర్వహించి పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా పై చర్చించాక వారి సలహాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వచ్చే అక్టోబర్ 3 వ తేదీన ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాల మార్పుకు సంబంధించిన ప్రతిపాదనల జాబితా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి పంపడం జరుగుతుందన్నారు. వచ్చే అక్టోబర్ నెల 8వ తేదీన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నుండి భారత ఎన్నికల సంఘానికి సమగ్ర పోలింగ్ కేంద్రాల జాబితా ఆమోదం కొరకు పంపడం జరుగుతుందన్నారు. వచ్చే అక్టోబర్ నెల 14 వ తేదీన పోలింగ్ కేంద్రాల జాబితా ఆమోదం పొందడం జరుగుతుందన్నారు. అక్టోబరు 18వ తేదీన ఫార్మాట్ 1 నుండి 8 వరకు సిద్ధం చేయడం జరుగుతుందన్నారు వచ్చే అక్టోబర్ 19వ తేదీ నుండి 28వ తేదీ వరకు సమగ్ర ముసాయిదా జాబితా, అనుబంధ జాబితాలు సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. వచ్చే అక్టోబర్ నెల 29 వ తేదీన సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. ఆ జాబితాపై అక్టోబర్ 29 నుండి నవంబర్ 28 వ తేదీ వరకు ఎవరైనా అభ్యంతరాలు గాని, క్లెయిములు గాని చేయవచ్చున్నారు. వచ్చే నవంబరు 9, 10, 23, 24 తేదీలలో శనివారము ఆదివారం ప్రత్యేక శిబిరాలను నిర్వహించి ఓటర్ల జాబితా పై అభ్యంతరాలు గాని, క్లెయిములు గాని స్వీకరిస్తామన్నారు. వచ్చిన క్లెయిములు గాని, అభ్యంతరాలు గాని ఈ ఏడాది డిసెంబరు 24 వ తేదీ నాటికి పరిష్కరించడం జరుగుతుందన్నారు. వచ్చే సంవత్సరం జనవరి 1 వ తేదీ నాటికి ఓటర్ల జాబితా తనిఖీ పూర్తి చేసుకుని, చివరి ప్రచురణ కోసం ఈసీఐ అనుమతి పొందడం జరుగుతుందన్నారు. వచ్చే సంవత్సరం జనవరి 6 వ తేదీన ఓటర్ల జాబితా చివరి ప్రచురణ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో కొత్తగా ఓటర్ల నమోదు కోసం యువతను చైతన్యం చేసి జిల్లా వ్యాప్తంగా ఓటర్ల అవగాహన( స్వీప్) కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా ఈనెల 10 వ తేదీలోగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూతు స్థాయి అధికారులతో సంబంధిత ఈఆర్వోలు సమావేశం నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 30 వ తేదీ లోగా సాధారణ ప్రజలతో కూడా సమావేశం నిర్వహించి ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలించి ఇల్లు మారిన ఓటర్లను, మృతి చెందిన ఓటర్లను గుర్తించాలన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా తయారు చేసేంతవరకు వారానికి ఒకసారి బూతు స్థాయి అధికారులు ఎవరో తెలియచెప్పాలన్నారు.

# భారీ వర్షాలతో వణికిపోతున్న ఉత్తరాంధ్ర

- వాయుగుండం ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం
- తాండవ జలాశయంలో ప్రమాదకర స్థాయికి చేరిన నీటిమట్టం
- ఏలూరు, కైకలూరు, గుడివాడ, మొండికోడు మధ్య నిలిచిపోయిన రాకపోకలు
- జీకే వీధి మండలం చట్రాయిపల్లి వద్ద విరిగిపడ్డ కొండచరియలు





విశాఖపట్నం,తెలంగాణ ముచ్చట్లు :భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర వణికిపోతున్నది. వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నది. దీంతో అనకాపల్లి జిల్లాలోని తాండవ జలాశయంలో నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరింది. అధికారులు రెండు గేట్లు ఎత్తి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.ఏలూరు జిల్లాలోని కొల్లేరుకు వరద క్రమంగా పెరుగుతున్నది. దీంతో లంక గ్రామాల ప్రజలు భయాందోళనల్లో ఉన్నారు. ఏలూరు, కైకలూరు, గుడివాడ, మొండికోడు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తమ్మిలేరుకు వరద ఉధృతి కొనసాగుతుండటంతో ఏలూరు-శనివారంపేట కాజ్వేపై వరద నీరు ప్రవహిస్తున్నది. ఈ నేపథ్యంలో కొల్లేరు, తమ్మిలేరు పరీవాహక ప్రాంత ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.అల్లూరి జిల్లాలోని చింతపల్లి ఏజెన్సీలో ఉన్న జీకే వీధి మండలం చట్రాయిపల్లి వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో గిరిజనుల ఇండ్లు ధ్వంసమయ్యాయి. కొండచరియల కింద చిక్కుకుపోయిన నలుగురిని గ్రామస్తులు కాపాడారు. సమాచారం అందుకున్న సీలేరు ఎస్ఐ ఆధ్వర్యంలో బృందం ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది.

# వరద ముంపు గ్రామాల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పర్యటన

## -కాలువలు,డ్రైన్లలో నీటి ప్రవాహా అడ్డంకులను యుద్ధ ప్రాతిపదిగిన తొలగించాలంటూ అధికారులకు ఆదేశాలు









నందివాడ,తెలంగాణ ముచ్చట్లు : నందివాడ మండలంలో వరద ముంపు గ్రామాల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పర్యటనలు కొనసాగుతున్నాయి. ప్రతి ముంపు గ్రామానికి వెళుతూ బాధిత ప్రజలకు ఎమ్మెల్యే రాము మనోధైర్యం కల్పిస్తున్నారు.అధికారులు, పార్టీ నేతలతో కలిసి ప్రత్యేక బస్సులో మండలంలోని ముంపు గ్రామాలైన తమిరిశ,అనమనపూడి, శంకరంపాడు, పోలుకొండ గ్రామాల్లో సోమవారం ఉదయం ఎమ్మెల్యే రాము పర్యటన చేపట్టారు. మండలంలోని ముంపు ప్రాంతాల ప్రజలకు చేసే సహాయ కార్యక్రమాలపై బస్సులోనే పార్టీ నేతలకు ఎమ్మెల్యే రాము దిశా నిర్దేశం చేశారు. పర్యటనలో భాగంగా ఎక్కడికక్కడ ప్రజలు రైతులతో.... ఎమ్మెల్యే రాము రోడ్లపైనే సమావేశం అవుతూ ప్రజల సంరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. తమిరిస గ్రామంలోనీ డ్రైన్లు, పంట కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న సమస్యలను రైతులు ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ మరియు డ్రైనేజీ శాఖల అధికారులకు ఫోన్లు చేసి యుద్ధ ప్రాతిపదికన కాలువల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ ఆదేశించారు.అనమనపూడి గ్రామంలోకి వరద ఉధృతి పెరుగుతుండడంతో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లను ఎమ్మెల్యే రాము ఆదేశాల మేరకు అధికారులు చేపట్టారు. వాహనాలు వెళ్లలేని మారుమూల ప్రాంతాలకు సైతం మోటార్ బైక్ మరియు నీళ్లలో నడుచుకుంటూ వెళ్తున్న ఎమ్మెల్యే రాము ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడారు. వరద ఉధృతినీ దృష్టిలో ఉంచుకొని కాలువల్లో నీరు దిగువకు ప్రవహించేలా చర్యలు చేపడుతున్నామని రైతులకు తెలియజేశారు. పర్యటనలో భాగంగా చంద్రయ్య డ్రైన్ లో నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రాము,ఎగువ నుండి వస్తున్న వరద నీటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానమైన చంద్రయ్య డ్రైన్ లో నేటి ప్రవాహ వివరాలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలంటూ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ వర్షాల ప్రభావం, ఎగువ నుండి వస్తున్న వరద నీటి వల్ల మరో రెండు రోజులు ముంపు సమస్య కొనసాగుతుందని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల బాధలు తెలుసుకొని వారికి ధైర్యం చెప్పడానికే తాను ముంపు గ్రామాల్లో పర్యటిస్తున్నాననీ ఎమ్మెల్యే రాము అన్నారు. ప్రతి ఒక్కరిని వచ్చి కలవలేకపోయినా, నష్టపోయిన ప్రతి ఒక్కరికి సహాయం అందించే బాధ్యత నాదని ఆయన పేర్కొన్నారు. ప్రజలందరూ బాగుండాలనేదే నా తాపత్రయమని ఈ సందర్భంగా రాము అన్నారు.మధ్యాహ్నం నుండి రుద్రపాక, గాజులపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే రాము పర్యటించనున్నారు.


# ప్రకాశం బ్యారేజి గేట్లను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు అరెస్టు

విజయవాడ,తెలంగాణ ముచ్చట్లు : ప్రకాశం బ్యారేజి గేట్లను ఢీకొట్టిన పడవలు వైసీపీ నేతలవేనని గుర్తించారు. ఈ క్రమంలోనే ఇద్దరు నిందితులను విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు.ప్రకాశం బ్యారేజిని ఢీకొట్టిన పడవల్లో మూడింటిని కుక్కలగడ్డ ఉషాద్రికి చెందినవిగా పోలీసులు గుర్తించిన సంగతి తెలిసిందే. దీంతో ఉషాద్రిని పోలీసులు ఆరెస్టు చేశారు. ఆయనతో పాటు సూర్యపాలెం వాసి కోమటిరెడ్డి రామ్మోహన్ను కూడా అరెస్టు చేసి విజయవాడ కోర్టుకు తరలించారు.భారీ వరదల నేపథ్యంలో ఈ నెల 1వ తేదీన బ్యారేజి కౌంటర్ వెయిట్లను పలు బోట్లు ఢీకొట్టాయి. దీంతో 67, 69, 70 గేట్ల వద్ద సుమారు 17 టన్నుల కౌంటర్ వెయిట్లు ధ్వంసమయ్యాయి. ఇందులో మూడు పడవలపై వైసీపీ పార్టీ రంగులు ఉండటం పలు అనుమానాలకు తావిచ్చింది. పైగా ఆ బోట్ల కోసం ఇప్పటివరకు వాటి యజమానులు ఎవరూ రాలేదు. దీంతో పడవలు కొట్టుకురావడంలో యజమానుల నిర్లక్ష్యంతో పాటు.. ఏదైనా కుట్ర కోణం ఉందా అని అనుమానించారు. ఈ క్రమంలోనే దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. వైసీపీ నేతల కుట్ర ఉందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు నివేదికను ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి అందజేశారు.

# పాము కాటుకు గురై మృతి చెందిన ఆయా బేబమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

## -సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ సి పి రెడ్డి

గుడివాడ, తెలంగాణ ముచ్చట్లు : పాము కాటుకు గురై మృతి చెందిన ఆయా చానావతి బేబమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిఐడియూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ సి పి రెడ్డి డిమాండ్ చేశారు. ఆమె గుడివాడ కార్మిక నగర్ ఎలిమెంటరీ స్కూల్లో గత 25 సంవత్సరాల నుంచి ఆయాగా పనిచేస్తుందని చెప్పారు. పని ముగించుకుని ఇంటికి వెళ్లి బట్టలు ఆరేస్తూ ఉండగా పాము కాటుకు గురై చనిపోవడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వం వారు తక్షణమే ఆమెకు న్యాయం చేయాల్సిందిగా సిఐటియు డిమాండ్ చేస్తుందని తెలిపారు. చంద్రయ్య కాలవ గట్టుమీద ఆమె అద్దె ఇంటిలో ఉంటుంది. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం నాదుకోవాల్సిందిగా కోరుతున్నాం .ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ సి పి రెడ్డి,బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆర్ .కొండ, ఐద్వా కార్యదర్శి పి రజిని హాస్పిటల్ కి వెళ్లి మృతదేహాన్ని చూసి ఈ మేరకు డిమాండ్ చేశారు.




తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక



# సినిమా న్యూస్



# టోన్డ్ బాడీతో మతులు చెడగొట్టిన పటానీ




సీకే బ్యూటీ దిశా పటానీ స్టన్నింగ్ ఫ్యాషన్ సెన్స్, ఫిట్ నెస్ గురించి చెప్పాల్సిన పని లేదు. ప్రతిసారీ ఏదో ఒక కొత్తదనంతో అభిమానులను స్టన్ అయ్యేలా చేస్తుంది. ఇక బికినీలు, అథ్లెటైజర్స్ తో ఫ్యాన్స్ కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటివ్వడంలో దిశా తర్వాతే. ఇప్పుడు మరోసారి దిశా పటానీ తనదైన శైలిలో చెలరేగింది. తాజా ఫోటోషూట్ లో టోన్డ్ ఫిజిక్ ని ఎలివేట్ చేస్తూ బ్లాక్ బాటమ్, రెడ్ స్పోర్ట్స్ బ్రా ధరించిన ఈ బ్యూటీ న్యూట్రిషన్ ప్రచారంలో బిజీగా కనిపించింది. ముఖ్యంగా దిశా టోన్డ్ దేహశిరులు యువతరం దృష్టిని విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ఈ అందమైన ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా దూసుకెళుతోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే .. లోఫర్ చిత్రంతో టాలీవుడ్ కి పరిచయమైన దిశా చాలా గ్యాప్ తర్వాత కల్కి 2989 ఏడి అనే తెలుగు చిత్రంలో నటించింది. దిశా తన కెరీర్ లో ఉత్తమ విజయాన్ని సెలబ్రేట్ చేసుకుంది. సల్మాన్ ఖాన్, టైగర్ ష్రాఫ్ లాంటి స్టార్ హీరోలు ఇవ్వలేని బంపర్ హిట్ ని ప్రభాస్ ఈ సన్నజాజి కెరీర్ కి అందించాడు. ప్రస్తుతం దిశా మరో సౌత్ సినిమాలో నటించింది. సూర్య కంగువలో కీలక పాత్రను పోషించింది. కల్కి తరహాలోనే మరో భారీ పాన్ ఇండియా హిట్ తనకు దక్కుతుందని హోప్ తో ఉంది. కంగువ అక్టోబర్ 10న విడుదల కానుండగా ప్రచారంలో బిజీ అవుతోంది.

# మాల్దీవ్స్‌లో బికినీలో ఎవరీ లవ్‌లీ?



లవ్‌లీ' చిత్రంతో తెలుగు వారికి పరిచయమైంది కన్నడ బ్యూటీ శాన్వి శ్రీవత్సవ. ఆది సాయికుమార్ హీరోగా దర్శకురాలు బి.జయ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. క్యూట్ లుక్స్ తో కుర్రకారు హృదయాలను మెలిపెట్టిన ఈ బ్యూటీ విష్ణు మంచు సరసన ఆర్జీవీ డైరెక్షన్ లో ఎటాక్ సినిమాలో నటించింది. గ్లామర్ ఎలివేషన్ పరంగా హద్దులు చెరిపేసి చెలరేగిపోయింది. అయినా ఇవేవీ కలిసి రాలేదు. శాన్వీ పూర్తిగా కన్నడ పరిశ్రమకే అంకితమైంది. బహుభాషా చిత్రం %-%శ్రీమన్నారాయణ%-%లో రక్షిత్ శెట్టి సరసన నటించి మెప్పించింది. శాన్వి నటించిన మహా వీర్యార్ విడుదలై రెండేళ్లయింది. ఈ సందర్భంగా ఇటీవల సామాజిక మాధ్యమాల్లో సినిమా ఫోటోలను షేర్ చేసుకుని ఆనందం వ్యక్తం చేసింది. తాను ఇప్పటివరకూ చేసిన వాటిలో అత్యంత స్వచ్ఛమైన పాత్ర దేవయానిలో నటించానని వెల్లడించింది. ఇక దీంతో పాటు సామాజిక మాధ్యమాల్లో ఈ భామ నిరంతర ఫోటోషూట్లతో వేడెక్కిస్తూనే ఉంది. ఇప్పటికే ఇన్ స్టాలో లక్షలాదిగా ఫాలోవర్స్ ఉన్న ఈ బ్యూటీ..లేటెస్ట్ ఫోటోషూట్ తో మరోసారి కవ్వించింది. శాన్వి తాజా ఫోటోషూట్ అభిమానుల్లోకి వైరల్ గా దూసుకెళుతోంది. శాన్వి ప్రస్తుతం మాల్దీవుల విహారంలో ఎంజాయ్ చేస్తోంది. అక్కడ కొద్ది రోజులుగా విలాసాలను ఆస్వాధిస్తోంది. తాజాగా బికినీలో శాన్వి జిల్లనిపించింది. చిరుత తోలు బికినీలో శాన్వి అందచందాలు కుర్రకారు మతులు చెడగొడుతున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలో వైరల్ గా మారాయి. శాన్వీ శ్రీవత్సవ ఇటీవల త్రిశూలం - బ్యాంగ్ అనే రెండు కన్నడ చిత్రాల్లో నటించింది. బ్యాంగ్ చిత్రం గత ఏడాది ఆగస్టులో విడుదలై మిశ్రమ స్పందనలు అందుకుంది. త్రిశూలం చిత్రీకరణ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమవుతోంది. అలాగే శాన్వి మహావీర్యార్ చిత్రంతో మలయాళంలోను అడుగుపెట్టింది. తదుపరి ఓ వెబ్ సిరీస్ కోసం కథ వింటోందని తెలిసింది. కన్నడ సినిమా ఉగ్రం రీమేక్ తో మరాఠాలోకి ఈ భామ అడుగుపెడుతోంది. రాంతి అనేది అక్కడ టైటిల్.

# ఒకేసారి ముగ్గురితో ప్రభాస్ లవ్ గేమ్స్..



డార్లింగ్ ప్రభాస్ ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో ది రాజాసాబ్ మూవీ చేస్తున్నారు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ భారీ బడ్జెట్ తో నిర్మిస్తోన్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. హర్రర్ కామెడీ జోనర్ లో ది రాజాసాబ్ మూవీ సిద్ధం అవుతోంది. ఇదిలా ఉంటే ఈ చిత్రంలో ప్రభాస్ కి జోడీగా మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ప్రస్తుతం దర్శకుడు మారుతి అస్సలు బ్రేక్ తీసుకోకుండా ఈ మూవీ షూటింగ్ చేస్తున్నారంట. ముగ్గురు హీరోయిన్స్ తో ప్రభాస్ నడుమ వచ్చే సన్నివేశాలని ప్రస్తుతం చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. వీలైనంత వేగంగా ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ చేయాలని మారుతి ప్లాన్ చేసుకున్నాడు. అందుకు తగ్గట్లుగానే షూటింగ్ షెడ్యూల్ పెట్టుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. వినాయకచవితి, ఆదివారం కూడా రెస్ట్ తీసుకోకుండా షూట్ చేసారంట. ప్రస్తుతం కీలకమైన ఫన్నీ సీక్వెన్స్ ని మారుతి తెరకెక్కిస్తున్నారంట ఈ సీక్వెన్స్ లలో హీరో, హీరోయిన్స్ తో పాటు మరికొంత మంది నటీనటులు కూడా పాల్గొంటున్నట్లు సమాచారం. కల్కి 2898ఏడీ తర్వాత ప్రభాస్ నుంచి రాబోయే సినిమా ది రాజాసాబ్. 2025 ఏప్రిల్ 10న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలని డిసైడ్ అయ్యారు. ఇప్పటికే మూవీ షూటింగ్ సగం వరకు కంప్లీట్ అయినట్లు తెలుస్తోంది. ఇప్పుడు మిగిలిన టాకీ పార్ట్, సాంగ్స్ అన్ని కూడా బ్యాక్ టూ బ్యాక్ షూట్ చేయనున్నారంట. ప్రభాస్ కూడా మారుతి దర్శకత్వంలో సినిమాని కంప్లీట్ చేసుకొని హను రాఘవపూడితో చేయనున్న ఫౌజీని సెట్స్ పైకి తీసుకొని వెళ్లనున్నట్లు సమాచారం. దాంతో పాటుగా సందీప్ రెడ్డి వంగా స్పిరిట్ మూవీ కూడా ఈ ఏడాదిలోనే స్టార్ట్ కాబోతోంది. అలాగే కల్కి2898ఏడీ పార్ట్ 2 కూడా సెట్స్ పైకి వెళ్లాల్సి ఉంది. మారుతితో చేస్తోన్న ది రాజాసాబ్ షూటింగ్ కంప్లీట్ అయ్యాక మిగిలిన సినిమాలకి డార్లింగ్ ప్రభాస్ క్లియరెన్స్ ఇవ్వనున్నారంట. ది రాజాసాబ్ మూవీ నుంచి వచ్చిన టీజర్ తో సినిమాపై ఇప్పటికే అంచనాలు పెరిగిపోయాయి.

# హేమ కమిటీ దెబ్బకి అక్కడా ఓ కమిటీ!



జస్టిస్ హేమ కమిటీలు లాంటివి ఇతర పరిశ్రమల్లోనూ రావాలి అన్న డిమాండ్ తెరపైకి వస్తోన్న సంగతి తెలిసిందే. కన్నడ, కోలీవుడ్, టాలీవుడ్ లోనూ ప్రభుత్వాలు ఇలాంటి కమిటీలు తీసుకురావాలి అన్న అంశాన్ని లేవనేత్తారు. ఈ నేపథ్యంలో తాజాగా నడిగర్ సంఘం మహిళలపై వేధింపుల వ్యవహారంలో చర్యలకు సిద్దమైంది. నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ మహిళల రక్షణని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. విశాఖ కమిటీ సూచనల మేరకు నటీనటులు కోసం ఎస్ ఐఏఏ-జీఎస్ ఐససీ పేరుతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి రోహిణి అధ్యక్షురాలిగా వ్యవహరిస్తారు. సుహాసిని, ఖుష్బూ కీలక సభ్యులగా ఉంటారు. అలాగే ఓ న్యాయవాదిని కూడా నడిగర్ సంఘం నియమించింది. విశాఖ కమిటీ తో ఇప్పటికే కొన్ని సమస్యలు పరిష్కరించామన్నారు. ఏ నటి అయినా లైంగిక వేధింపులకు గురైతే వెంటనే తమని సంప్రదించాలన్నారు. అలాంటి వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదు ఇచ్చిన వెంటనే పిలిపించి పరిష్కారం చూపుతామన్నారు. వేధింపులు అన్ని రంగాల్లోనూ ఉన్నాయన్నారు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY BOLLEPAKA RAJESH,PRINTED AT AMULYA PUBLICATIONS & PRINTERS GRAPHICS,H-NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA,DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.“PUBLISHED AT H.NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA, DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.EDITOR : BOLLEPAKA RAJESH,RNI: TELTEL/2023/88710,“CELL:9493669669, MAIL ID:telanganamuchatlu.in@gmail.com,Website:telanganamuchatlu.in